Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

బుధవారం
2 అక్టోబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 145
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## మత విశ్వాసాలకన్నా ప్రజల భద్రతే ముఖ్యం



- రోడ్లపై ఉన్న ఆలయాలు, దర్గాలు, గురుద్వారాలు తొలగించాల్సిందే
- ప్రజల భద్రతే ముఖ్యమని తేల్చిచెప్పిన అత్యున్నత న్యాయస్థానం
- బుల్డోజర్ జస్టిస్ పై దాఖలైన పిటిషన్ల విచారణలో కీలక వ్యాఖ్యలు
- భారతదేశంలో అన్ని మతాలకూ సమాన ప్రాధాన్యం ఉంటుందని వెల్లడి

## అక్టోబర్ 6న జనతా కా అదాలత్



- మరోసారి జనతా కా అదాలత్‌ను నిర్వహించనున్న మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్
- ప్రజలు, ప్రభుత్వం మధ్య దూరాన్ని తగ్గించుకొనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం.
- సెప్టెంబర్ 22వ తేదీన ఇదే కార్యక్రమాన్ని అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీలో నిర్వహించిన సంగతి తెలిసిందే.



## కేంద్రం వరద సాయం

- ఏపీకి రూ.1,036 కోట్లు, తెలంగాణకు రూ.416 కోట్లు విడుదల
- 14 వరద ప్రభావిత రాష్ట్రాలకు రూ.5,858 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- అత్యధికంగా మహారాష్ట్రకు రూ.1,432 కోట్లు విడుదల
- తక్షణ సాయంగా నిధులు మంజూరు చేసిన కేంద్ర హోంశాఖ

# సోషల్ మీడియాపై కాంగ్రెస్ గుర్రు

- తెలంగాణ సర్కార్ సీరియస్.. ఇకపై వారిని ఉపేక్షించేది లేదంటూ..
- సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న వార్తలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది
- అభ్యంతరమైన భాషతో కొందరు నేతలను టార్గెట్ చేసి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి.
- వీడియోలు పోస్ట్ చేస్తున్న వారిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.
- రేవంత్ రెడ్డి తో పాటు మహిళా మంత్రులను టార్గెట్‌గా, వారిపై ఘోరమైన విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలలో వీడియోలు



**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణలో హైడ్రా కూల్చివేతలు విపక్షాలకు ఒక ఊతంలాగా దొరికాయి. పూర్తిగా నైరాశ్యంలో ఉన్న విపక్ష పార్టీలకు హైడ్రా కూల్చివేతలు కలసి వచ్చాయనే ప్రచారం సోషల్ మీడియాలో నడుస్తుంది. నిజానికి నగరానికి చెందిన ఎమ్మెల్యేలు కూడా హైడ్రా కూల్చివేతలపై కొంత విముఖత చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఒక మంచి పనిచేసినప్పుడు ఇలాంటి విమర్శలు, ఆరోపణలు సహజమే. ఎందుకంటే ఒక సదుద్దేశ్యంతో చేసే పనికి ఆటంకాలు కూడా అదే మాదిరిగా వస్తుంటాయి. మెయిన్ స్ట్రీమ్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో కూడా - మిగతా3లో



## పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారు
- ఎప్పుడు ఇండ్లు కూల్చుతరోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారు.
- గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరు
- వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సర్వే, కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లో లక్షలాది మందికి నిద్రలేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు ఇండ్లు కూల్చుతరోనని ప్రజలు ఆవేదనలో ఉన్నారని - మిగతా3లో



## సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహులకు శుభవార్త

- ఇదివరకు సర్పంచ్‌గా పోటీ చేయాలి అంటే ఇద్దరు పిల్లలు మించి ఉండకూడదనే నిబంధన ఉండేది.
- ఎంతమంది పిల్లలున్నా కూడా సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి అర్హులు అవుతారని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం
- ఈసారి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులకు పిల్లల సంఖ్య బెడద తప్పింది.
- ఇంకా దీనిపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంది.

**శుభ తెలంగాణ హైదరాబాద్**

గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ లాంటి స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థికి ముగ్గురు బిడ్డలు ఉంటే అనర్హులు అవుతారనే ప్రధానమైన నిబంధన ఉండేది. కానీ సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహుల నుంచి వినతులు పెద్ద ఎత్తున రావడంతో ఈ నిబంధనలకు రేవంత్ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో వెసులుబాటు కల్పించారు. ఈ మేరకు సర్పంచ్‌గా పోటీ చేయాలనుకునే ఆశావాహులకు రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఇదివరకు సర్పంచ్‌గా పోటీ చేయాలి అంటే ఇద్దరు పిల్లలు మించి ఉండకూడదనే నిబంధన ఉండేది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ నిబంధనను తొలగిస్తూ ముగ్గురు లేదా ఆపై ఎంతమంది పిల్లలున్నా కూడా - మిగతా3లో

# రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు

- పర్యావరణహితానికి ఎంతో ఉపయోగం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీపై జపాన్ కంపెనీ యమనాషితో చర్చలు



**శుభ తెలంగాణ హైదరాబాద్**

థర్మల్ విద్యుత్తుకు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయడంలో భాగంగా సోలార్ ప్లాంట్లతో పాటు గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లనూ తెలంగాలో ఏర్పాటు చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. జపాన్‌లోని టోక్యోకు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న యమనాషి గ్రీన్ హైడ్రోజన్ కంపెనీ పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఆయన మంగళ వారం అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ జరుగుతున్న గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదనను పరిశీలించారు. సైంటిస్టులు, కంపెనీ నిర్వాహకులతో చర్చించారు. ఇక్కడ ఉత్పత్తి అయిన హైడ్రోజన్‌ను రేసింగ్ కార్లకు ఇంధనంగా, సూపర్ మార్కెట్లలో ఫ్యూయల్ సెల్స్‌గా, ఫ్యాక్టరీలలోని బాయిలర్లకు ఉష్ణాన్ని అందించేదిగా వినియోగిస్తున్నారని నిర్వాహక ఇంజనీర్ కునిగి వివరించారు. ఈ తరహా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను తెలంగాణలోనూ ఏర్పాటు చేయటానికి ఇంధన శాఖ సన్నాహాలు ప్రారంభించాలని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గ్రీన్ హైడ్రోజన్‌ను ఎరువుల కర్మాగారాలు, ఆర్టీసీకి, ఇతర పరిశ్రమలకూ సరఫరా చేయవచ్చని తద్వారా పర్యావరణహిత చర్యలకు ఎంతో దో హదం చేసిన వారమవుతామని ఆయన పేర్కొన్నారు. యమనాషి కంపెనీ రూపొందిస్తున్న బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం(బీఈఎసఎస్) బ్యాటరీల తయారీ విభాగాన్ని కూడా భట్టి పరిశీలించారు. తెలంగాణలో గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం సాంకేతికత వినియోగంపై ఉమ్మడి భాగస్వామ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు కలిసి రావాలని భట్టి కోరగా.. యమనాషి కంపెనీ అధికారులు సానుకూలంగా స్పందించారు. '

**షిబుయా తరహా ట్రాఫిక్ నియంత్రణ**

టోక్యో నగరంలోని హచుకో రైల్వే స్టేషన్ వద్ద గల షిబుయా క్రాసింగ్‌ను భట్టివిక్రమార్క సందర్శించారు. ఒకేసారిగా 3000 మంది బాటసారులు ఎలాంటి ఆటంకం లేకుండా రోడ్లు దాటడానికి - మిగతా3లో

## 3వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం

- భవిష్యత్‌లో మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు కురవాలి
- వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో వెలుగులు నింపేందుకు ప్రణాళికలు
- మంత్రి పొన్నం ప్రభాకర్



**శుభ తెలంగాణ హైదరాబాద్**

రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు నిండుకుండలా మారాయని తెలంగాణ జిల్లాల్లోని అన్ని చెరువుల్లో చేపల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 3 వ తేదీ - మిగతా3లో

## సమస్యను జఠిలం చేసేలా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది

- హైడ్రా, మూసీ ప్రాజెక్టులపై మంత్రి శ్రీధర్ బాబు కీలక ప్రకటన
- శుభ్రమైన నీరు. వాయువు అందించడమే మూసీ ప్రాజెక్ట్, హైడ్రా లక్ష్యాలు
- 2020లో కేటీఆర్ మంత్రిగా ఉండగా బఫర్ జోన్ నిర్ధారించి ఇళ్లు కూల్చాలని నిర్ణయించారు



**శుభ తెలంగాణ హైదరాబాద్**

హైడ్రా కూల్చివేతలు, మూసీ సుందరీకరణ కోసం చేపడుతున్న మార్కింగ్ ప్రక్రియపై బాధితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. శుభ్రమైన నీరు. వాయువు అందించడమే మూసీ ప్రాజెక్ట్, హైడ్రా లక్ష్యాలని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు వారు - మిగతా3లో

# మత విశ్వాసాలకన్నా ప్రజల భద్రతే ముఖ్యం



ప్రజల భద్రతే ముఖ్యం తప్ప మత విశ్వాసాలు కాదని దేశ అత్యున్నత న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. భారతదేశం లౌకిక దేశమని గుర్తుచేస్తూ రోడ్లను ఆక్రమించిన ఆలయాలు, దర్గాలు, గురద్వారాలు.. ఏ మతానికి చెందిన కట్టడాలైనా సరే తొలగించాల్సిందేనని తేల్చిచెప్పింది. ప్రజల భద్రత విషయంలో రాజీ ధోరణి ఎట్టి పరిస్థితుల్లోనూ కూడదని వివరించింది. ఈమేరకు బుల్డోజర్ జస్టిస్ కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు మంగళవారం ఈ వ్యాఖ్యలు చేసింది.

**ఇదీ కేసు...**

ఏదైనా నేరానికి పాల్పడిన వ్యక్తుల ఇళ్లను ప్రభుత్వం కూల్చివేస్తోందనే ఆరోపణలు ఇటీవల పెరిగాయి. అత్యాచారం, హత్య కేసులలో నిందితుల ఇంటిపైకి బుల్డోజర్లను పంపిస్తోందని పలు రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు వినిపిస్తున్నాయి. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. నేరం జరిగిన ఒకటి రెండు రోజుల్లో పలు కారణాలు చూపిస్తూ నిందితుల ఇళ్లను అధికారులు కూల్చివేస్తున్నారు. ఇది 'బుల్డోజర్ జస్టిస్' అంటూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం జరుగుతోంది. దీనిని కోర్టులు ఆక్షేపించాయి. ఒకవేళ నిందితుడు నేరానికి పాల్పడినా సరే ఇంటిని కూల్చడం సరికాదని వ్యాఖ్యానించాయి. ఈ క్రమంలోనే సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. బుల్డోజర్ జస్టిస్ ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను మంగళవారం సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ విచారించారు. రాష్ట్ర ప్రభుత్వాల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. ఒకటీ రెండు సంఘటనల ఆధారంగా న్యాయస్థానం ఓ అంచనాకు రావద్దని కోరారు. ఇళ్ల కూల్చివేతలకు సంబంధించి ముందుగా నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ కట్టడాలని తేల్చాక నోటీసులు ఇచ్చి కూల్చివేస్తున్నట్లు వివరించారు. ఏదో ఒక ఘటననో, ఓ వర్గం వారి ఆరోపణలతోనో కూల్చివేతలు అక్రమమని భావించవద్దని కోరారు. దీనిపై స్పందించిన సుప్రీం బెంచ్... మనది లౌకిక దేశమని గుర్తుచేస్తూ మత విశ్వాసాలకన్నా ప్రజల భద్రతే ముఖ్యమని గతంలోనూ పలు తీర్పుల్లో స్పష్టం చేసినట్లు తెలిపింది. రోడ్లపై ఉన్న మతపరమైన కట్టడాలను తొలగింపును కోర్టు సమర్థించిందని గుర్తుచేసింది. నిందితుల ఇళ్ల కూల్చివేత విషయంలోనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, ఆక్రమణల తొలగింపు చట్టప్రకారమే జరగాలన్నదే ధర్మాసనం అభిప్రాయమని పేర్కొంది.

## దేరాబాబా మళ్లీ బయటకు...
## 4 ఏళ్లలో 15వ పెరోల్



**చండీగఢ్:** ఇద్దరు మహిళా భక్తులపై అత్యాచారానికి పాల్పడిన కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష పడిన డేరా సచ్చా సౌదా నేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ మరోసారి జైలు నుంచి బయటకు వస్తున్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ ఆయన పెరోల్‌పై బయటకు వస్తుండటం విశేషం కాగా, పెరోల్ కోరుతూ ఆయన చేసుకున్న విజ్ఞప్తిని భారత ఎన్నికల కమిషన్ సోమవారంనాడు ఆమోదించింది. గత తొమ్మిది నెలల్లో ఆయన పెరోల్‌పై జైలు బయటకు రానుండటం ఇది మూడవది కాగా, నాలుగేళ్ల క్రితం దోషిగా తేలిన తర్వాత పెరోల్ పొందడం పదిహేనవది. అక్టోబర్ 5న హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా, గతంలోని మున్సిపల్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెరోల్‌పై డేరాబాబా విడుదలైన సందర్భాలున్నాయి. ఈసారి కూడా ఎన్నికలకు ఆయన విడుదలవుతున్నందున కొన్ని షరతులతో తాత్కాలిక విడుదలకు ఈసీ అంగీకరించింది. హర్యానాలో అడుగుపెట్టరాదని, ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనరాదని ఆంక్షలు విధించింది. గత ఆగస్టులోనూ 23 రోజులు పెరోల్‌తో డేరాబాబా జైలు బయటకు వచ్చారు. తిరిగి సెప్టెంబర్ 2న సునరియా జైలుకు తిరిగి వెళ్లారు.

## పేజర్లను పేల్చిన ఇజ్రాయిల్.. దీనిపై భారత ఆర్మీ చీఫ్ ఏమన్నారంటే




**న్యూఢిల్లీ:** భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఇవాళ ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ ఆయన కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఇటీవల లెబనాన్‌లో పేజర్లు పేలిన విషయం తెలిసిందే. అయితే ఆ పేజర్లను బాంబులుగా మార్చింది ఇజ్రాయిల్. మరి ఇలాంటి ఘటనలో ఇండియా జరగకుండా ఉండాలంటే ఏం చేయాలన్న ప్రశ్నకు జనరల్ ద్వివేది సమాధానం ఇచ్చారు. ఆ పేజర్లు తైవాన్ కంపెనీకి చెందినవని, కానీ వాటిని హంగేరీ కంపెనీకి సరఫరా చేశారని, హంగేరి కంపెనీ వాటిని లెబనాన్‌కు పంపిందన్నారు. ఇజ్రాయిలీలు ఓ షెల్ కంపెనీని క్రియేట్ చేసి.. హిజ్‌బొల్లాకు మాస్టర్‌స్ట్రోక్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. దీని కోసం ఎన్నో ఏండ్ల ప్రణాళిక అవసరం అని, అంటే ఆ దేశం ఆ ప్లాన్ ఎప్పుడో వేసిందన్నారు. మనం పోరాడుతున్న తీరుతో యుద్ధం ప్రారంభం కాదు అని, మనం ప్లానింగ్ స్టార్ట్ చేసిన రోజు నుంచే యుద్ధం మొదలైనట్లు అవుతుందని ఆర్మీ చీఫ్ ద్వివేది అభిప్రాయపడ్డారు. ఇదే చాలా ముఖ్యం అని ఆయన పేర్కొన్నారు. ఇక మన దేశం గురించి ఆలోచిస్తే, సప్లయ్ చెయిన్ విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. టెక్నిల్ స్థాయిలో అయినా లేక మాన్యువల్ స్థాయిలో అయినా కచ్చితంగా వేర్వేరు స్థాయిల్లో పర్యవేక్షణ ఉండాలన్నారు. అమర్‌నాథ్ యాత్రలో ఈసారి భక్తుల సంఖ్య ఇప్పటికే 5 లక్షలు దాటిందని, జమ్మూకశ్మీర్‌కు రెండు కోట్ల మంది టూరిస్టులు వచ్చినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు కేవలం ఇద్దరు ఉగ్రవాదులను మాత్రమే రిక్రూట్ చేశారని, గతంలో ఈ సంఖ్య 300 వరకు ఉండేదన్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే, శాంతి, సామరస్యం దిశగా మనం వెళ్తున్నట్లు అనిపిస్తోందన్నారు. ఉగ్రవాదులు ఎక్కువ శాతం విదేశీయులే ఉన్నారని, సెక్యూర్టీ దళాలను పునరుత్తే చేశామన్నారు. పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆ రాష్ట్రం నిలకడగా ఉంటుందన్నారు.

# అక్టోబర్ 6న జనతా కా అదాలత్



**న్యూఢిల్లీ :** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ జనతా కా అదాలత్‌ను మరోసారి నిర్వహించనున్నారు. అక్టోబర్ 6వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలోని చత్రశాల్ స్టేడియంలో ఈ కార్యక్రమాన్ని ఆయన చేపట్టనున్నారు. సెప్టెంబర్ 22వ తేదీన ఇదే కార్యక్రమాన్ని అరవింద్ కేజ్రీవాల్ న్యూఢిల్లీలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ప్రజలతో నేరుగా ప్రభుత్వం సంబంధాలు కలిగి ఉండేలా ఈ జనతా కా అదాలత్ కార్యక్రమాన్ని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తెరపైకి తీసుకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమం వేదికగా ప్రజలు.. తమ సమస్యలను ప్రభుత్వంలోని మంత్రులతోపాటు ఉన్నతాధికారులతో నేరుగా విన్నవించుకోవచ్చు. ప్రజలు, ప్రభుత్వం మధ్య దూరాన్ని తగ్గించుకొనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ వ్యవహారంలో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆయన్ని తీహాడ్ జైలుకు తరలించింది. ఈ కేసులో ఆయనకు ఇటీవల సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ముఖ్యమంత్రిగా ఎక్కడా సంతకం చేయవద్దంటూ సీఎం కేజ్రీవాల్‌కు షరతు సైతం కోర్టు విధించింది. దీంతో జైలు నుంచి విడుదలైన అరవింద్ కేజ్రీవాల్.. న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జనతా కా అదాలత్‌ను ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

అలాగే బీజేపీలో చోటు చేసుకున్న పరిణామాలతోపాటు ప్రధాని నరేంద్రమోదీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఆ మరునాడు ఆమ్ ఆద్మీ పార్టీ శాసన సభ పక్షం సమావేశమైంది. దీంతో అతిషిని ముఖ్యమంత్రిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. దీంతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సెనాతో సీఎం అరవింద్ కేజ్రీవాల్ సమావేశమ్యారు. అందులోభాగంగా తన ముఖ్యమంత్రి పదవికీ రాజీనామా లేఖతోపాటు అతిషిని సీఎంగా పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకున్న పత్రాలను ఢిల్లీ ఎల్జీకి అందజేశారు. దాంతో ఢిల్లీ సీఎంగా అతిషి బాధ్యతలు చేపట్టారు. ఇక అక్టోబర్ 6వ తేదీన చాత్రశాల్ స్టేడియంలో ఈ 'జనతా కా అదాలత్' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ ఏడాది మార్చి 21వ తేదీన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. దీంతో నాటి నుంచి ఆయన జైల్లోనే ఉండిపోయారు. అలాగే ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా సైతం తీహాడ్ జైల్లోనే ఉన్నారు. దీంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరిగిందని ఆ పార్టీలోని సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది నవంబర్‌లోనే అంటే.. మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికలతోనే నిర్వహించాలని అరవింద్ కేజ్రీవాల్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కానీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోనే నిర్వహిస్తామని ఇప్పటికే కేంద్రం స్పష్టం చేసింది. అదీకాక.. రానున్న ఎన్నికల్లో ప్రజలు తన పార్టీని గెలిపిస్తే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టిస్తానంటూ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అందుకోసమే తాను ముఖ్యమంత్రి పదవికీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

## కేజ్రీవాల్, గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ విడుదల వెనుక బీజేపీ హస్తం

**కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీయాలనుకుంటున్నారని ఆరోపణ**

**హర్యానా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా**

**తన సహచరులను బీజేపీ బెదిరిస్తోందన్న రాబర్ట్ వాద్రా**

ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ జైలు నుంచి బయటకు రావడం వెనుక బీజేపీ హస్తం ఉందని ఏఐసీసీ నాయకురాలు ప్రియాంకగాంధీ భర్త రాబర్ట్ వాద్రా సంచలన ఆరోపణలు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీసే లక్ష్యంతో వారిని విడుదల చేశారన్నారు. హత్య, అత్యాచారం, అభియోగాలు మోపిన గుర్మీత్ సింగ్‌ను ఎన్నికలకు 20 రోజుల ముందు విడుదల చేశారని, అలాగే కేజ్రీవాల్ కూడా బయటకు వస్తే హర్యానాలో ప్రచారం చేస్తారని, ఇది తమకు ఉపయోగపడుతుందని బీజేపీ భావిస్తున్నట్లుగా ఉందన్నారు. కానీ బీజేపీ ఊహించినట్లుగా వారు కాంగ్రెస్ పార్టీ గెలుపును దెబ్బతీయలేరన్నారు. హర్యానా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, భారీ మెజార్టీతో గెలిపిస్తారని వాద్రా ధీమా వ్యక్తం చేశారు. తనకు సంబంధించిన కంపెనీ ద్వారా హర్యానాలో ఉద్యోగాలు కల్పించగలనని రాబర్ట్ వాద్రా వెల్లడించారు. హర్యానాలో తాను ఉద్యోగాలు ఇవ్వగలనని, కానీ బీజేపీ తన సహచరులను బెదిరింపులకు గురి చేయడంతో వారు దూరంగా వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పని చేయడం కష్టమని, ఆర్థికంగా తనను దెబ్బతీయాలని చూస్తున్నారని వాపోయారు.

# రాజకీయ కుట్రల బాధితురాలు నా భార్య





**బెంగళూరు:** రాజకీయలతో ఏమాత్రం సంబంధం లేని తన భార్య పార్వతి రాజకీయ విద్వేషాలు, కుట్రల భాదితురాలని, తీవ్ర మనోవేదనకు గురైందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. తన భూములను ముడా సంస్థకు ఇచ్చేస్తున్నట్టు ఆమె ప్రకటించడం, లేఖ రాయడం తనకు ఆశ్చర్యం కలిగించిందని, అయినప్పటికీ ఆమె నిర్ణయాన్ని తాను గౌరవిస్తున్నానని సామాజిక మాధ్యమం 'ఎక్స్' సీఎం తెలిపారు. పసుపు కుంకుమలుగా తన సోదరుడు ఇచ్చిన ప్లాట్లపై ఇంత రాద్ధాంత తగదని, ఎలాంటి అవినీతి మచ్చలేని తన భర్త రాజకీయ జీవితానికి ముప్పు తెస్తున్న 'ముడా'కు చెందిన 14 ప్లాట్లను తిరిగి ఇచ్చేస్తున్నట్టు సిద్ధరామయ్య భార్య సోమవారం ఒక లేఖ విడుదల చేశారు. దీనిపై సిద్ధరామయ్య స్పందిస్తూ, తన భార్యకు ఆమె సోదరుడు గిఫ్ట్‌గా ఇచ్చిన భూమిని 'ముడా' ఆక్రమించుకోవడంతో ప్రత్యామ్నాయ స్థలాన్ని ఆమె కోరిందని చెప్పారు. విజయనగరలో ప్రత్యామ్నాయం స్థలం ఇమ్మని ఆమె కోరలేదని, అయితే అక్కడే ఆమెకు స్థలం కేటాయించారని చెప్పారు. ఈ విషయాన్ని రాజకీయం చేశారని, బీజేపీ-జేడీఎస్ ఎలాంటి రాజకీయాలు చేసినా తాము ఎదుర్కొంటామని చెప్పారు. ఎలాంటి మచ్చలేని తన భర్త రాజకీయ జీవితాన్ని వివాదంలోకి లాగడం చూసే ఆమె భూములను తిరిగి ఇచ్చేయాలని నిర్ణయం తీసుకుందని, ఆ నిర్ణయం తనకు ఆశ్చర్యం కలిగించినా ఆమె నిర్ణయాన్ని తాను గౌరవిస్తున్నానని తెలిపారు. యడియూరప్ప కేసుకు, తన కేసుకు పొంతన లేదని కూడా సిద్ధరామయ్య తెలిపారు. డీనోటిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ కేసు ఆయనపై ఉందని, తనకు అలాంటిదేమీ లేదని అన్నారు. సెల్ఫ్ విట్నెస్‌గా తాను రాజీనామా చేయాల్సిన పని లేదనన్నారు. ఈడీ కావచ్చు, ఇంకెవరైనా కావచ్చు... లీగల్‌గా పోరాటం సాగిస్తానని చెప్పారు. తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదని మరోసారి తేల్చిచెప్పారు.

## దుష్యంత్ చౌతలా కాన్వాయ్‌పై రాళ్ల దాడి..
## సభలో ప్రసంగిస్తుండగా రాళ్లు విసిరిన దుండగులు



హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. జింద్ జిల్లా ఉచన కలాన్‌లో జననాయక్ జనతా పార్టీ అధ్యక్షుడు, హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతలా కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఈ దాడికి పాల్పడ్డారు. దుష్యంత్ చౌతలా బహిరంగ సభలో మాట్లాడుతుండగా.. కొందరు అగంతకులు గొడవ సృష్టించి కాన్వాయ్‌పై ఇటుకలు, రాళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో ఒక వాహనం అద్దాలు పగిలిపోయాయి. దాంతో పెద్ద సంఖ్యలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. దుష్యంత్‌తోపాటు ఆజాద్ సమాజ్ పార్టీ నేత, ఎంపీ చంద్రశేఖర్ కూడా ఉచానాలో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు. ఉచానా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చౌతలా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. చౌతలా 2019లో కూడా ఇదే నియోజకవర్గం నుంచి గెలిచారు. 2014లో బీజేపీ అభ్యర్థి ప్రేమ్‌లత చేతిలో ఓడిపోయారు. ఈసారి చౌతలాపై బీజేపీ అభ్యర్థి చతర్భుజ్ అట్టారి (బీజేపీ), బ్రిజేంద్ర సింగ్ (కాంగ్రెస్) పోటీ చేస్తున్నారు. కాగా జింద్‌లో తన కాన్వాయ్‌పై దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేశానని, దర్యాప్తు జరుపుతున్నారని చెప్పారు. దాడికి సంబంధించిన వీడియో ఫుటేజ్ అంతా తమ దగ్గర ఉందన్నారు. పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని చౌతలా కోరారు. ఎన్నికల కమిషన్‌కు తప్పనిసరిగా లేఖ రాస్తామని చెప్పారు. ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారని, గత రెండు ఎన్నికల్లోనూ తనపై దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరక్కుండా ప్రత్యేక నిఘా బృందాన్ని పంపాలని కోరారు.

## కులమతాల పేరుతో దేశ ఐక్యతకు కాంగ్రెస్ విఘాతం




**పల్వల్:** కులమతాల మధ్య చిచ్చు పెడుతూ దేశ ఐక్యతను విచ్ఛినం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ప్రధాన నరేంద్ర మోదీ అన్నారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పల్వల్‌లో మంగళవారం జరిగిన ర్యాలీలో ప్రధాని పాల్గొన్నారు. కుల రాజకీయాలు, అవినీతి, రిజర్వేషన్లతో సహా పలు అంశాలపై కాంగ్రెస్‌ను తప్పుపట్టారు. "ఒక సామాన్య కార్యకర్తగా చాలాకాలంగా హర్యానా రాజకీయాలను ఆమూలాగ్రంగా నేను గమనించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను కలుసుకునే అవకాశం ఇటీవల నాకు కలిగింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఇదే నా చివరి ర్యాలీ. అయితే ఇది ఒక ప్రత్యేకమైన ర్యాలీగా ఎప్పటికీ గుర్తిండిపోయేలా మీరు చేశారు" అని మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ రామమందిర నిర్మాణానికి అడ్డుపడిందని, జమ్మూకశ్మీర్‌లో సంపూర్ణంగా రాజ్యాంగాన్ని అమలు కానీయలేదని, అసెంబ్లీల్లో, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ పాటించలేదని, దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించలేదని, కేవలం సొంత కుటుంబం కోసమే పనిచేసిందని మోదీ విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నో పాపాలు చేసినప్పటకీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామనే కలలు కంటోందని అన్నారు. కులతత్వాన్ని ప్రచారం చేస్తూ దేశభక్తిని అణగదొక్కాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. దేశభక్తుల ఐక్యతను దెబ్బతీయాలనుకుంటోందని ఆరోపించారు. హర్యానా ప్రజలు సమైక్యంగా నిలిచి అభివృద్ధికే ఓటు వేయాలని కోరారు. దేశాన్ని ప్రేమించే వారంతా ఐక్యంగా ఉంటామని హర్యానా ప్రజలు ప్రతిన పూనాలన్నారు.

## వర్ధమాన్ గ్రూపు ఎండీ ఓస్వాల్‌ను
## ఏడు కోట్లు మోసం చేసిన సైబర్ నేరగాళ్లు



**న్యూఢిల్లీ:** వర్ధమాన్ గ్రూప్ అధినేత ఎస్పీ ఓస్వాల్‌ను మోసం చేశారు. ఆయన వద్ద నుంచి ఏడు కోట్లు లాగేశారు. సీజేఐ డీవై చంద్రచూడ్ గెటప్‌లో.. ఓ వర్చువల్ ఫేక్ కోర్టురూమ్‌ను తయారు చేసి.. ఎస్పీ ఓస్వాల్‌ను బెదిరించారు. టెక్స్‌టైల్ సంస్థ ఎండీ అయిన ఓస్వాల్.. ఆగస్టు 28, 29వ తేదీల్లో డిజిటల్ చోరీకి గురయ్యారు. పలు అకౌంట్లకు ఏడు కోట్లు బదిలీ చేసేలా ఆయన్ను వత్తిడి చేశారు. అయితే ఆ అకౌంట్లను ఫ్రీజ్ చేసి, వాటి నుంచి సుమారు అయిదు కోట్లు రికవరీ చేశారు. సైబర్ నేరగాళ్లు ఎలా మోసం చేశారన్న విషయాన్ని ఆ వ్యాపారవేత్త వివరించారు. మనీ ల్యాండరింగ్ కేసులో విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదరిస్తూ.. ఆ సైబర్ గ్యాంగ్ ఆయన వద్ద నుంచి ఏడు కోట్లు వసూల్ చేశారు. మీ పేరుతో కెనరా బ్యాంక్ అకౌంట్ ఉందని, ఆ అకౌంట్ నుంచి ఆర్థిక అక్రమాలు జరిగాయని ఆ గ్యాంగ్ బెదిరించింది. ఆ అకౌంట్‌కు నరేశ్‌గోయల్ కేసుతో లింకు ఉన్నట్లు మోసగాళ్లు బెదిరించినట్లు తెలుస్తోంది. వీడియోకాల్ చేసి ఓ ఫేక్ కోర్టురూమ్‌ను సృష్టించారు. ఆ కోర్టు రూమ్‌లో సీజేఐ చంద్రచూడ్ తన కేసును విచారిస్తున్నట్లు ఫ్రాడ్‌స్టర్లు చూపించారని ఓస్వాల్ తెలిపారు. వాట్సాప్ ద్వారా సీజే ఇచ్చిన ఆదేశాలను పంపించారు. ఆ ఆదేశాల ప్రకారం ఓస్వాల్ వేర్వేరు అకౌంట్లలో ఏడు కోట్లు జమ చేశాడు. నరేశ్ గోయల్ కేసు నుంచి రక్షిస్తామని హామీ ఇస్తూ.. ఫేక్ సుప్రీంకోర్టు ఆదేశాలు తనకు పంపినట్లు ఓస్వాల్ తెలిపారు. ఓస్వాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగస్టు 31వ తేదీన కేసు నమోదు చేశారు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలోని సైబర్ క్రైం సెంటర్ ద్వారా మూడు అకౌంట్లను సీజ్ చేశారు. వాటి నుంచి 5.25 కోట్లు రికవరీ చేశారు. ఈ నేరం వెనుక అంతరాష్ట్ర గ్యాంగ్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతాను చౌదరీ, ఆనంద్ కుమార్‌ను గౌహతిలో అరెస్టు చేశారు. ఆ ఇద్దరూ వ్యాపారులే. ఈ కేసులో మాస్టర్‌మైండ్, బ్యాంక్ ఉద్యోగి రూమి కాలిటా కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిమ్మి భట్టాచార్య, అలోక్ రంగి, గులామ్ ముర్తాజా, జాకిర్ కూడా ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

# పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడు

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని గోల్నాక పరిధి తులసీరామ్ నగర్‌లో మూసీ ప్రాంత వాసులను మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డితో కలిసి కేటీఆర్ పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేసిన వారిపై సీఎం పగపట్టారన్నారు. గరీబోళ్లంతా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నరని, వాళ్ల బతుకులను ఆగం చేయాలని చూస్తున్నాడని విమర్శించారు. మూసీమే లూఠో.. దిల్లీ మే బాంటో అనేది కాంగ్రెస్ నినాదమని విమర్శించారు. మీ ఇండ్ల మీదకు బుల్డోజర్ వస్తే కంటె అడ్డుపెట్టాలన్నారు. రేవంత్ రెడ్డి కాదు.. ఆయన తాత వచ్చినా ఏమీ చేయలేరన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో సగం డబ్బులతో మూసీ ప్రక్షాళన చేపట్టారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంత వాసులను అడవిలోకి పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు కడతామంటూ కూల్చుతున్నారని చెప్పారు. పేదల ఇళ్లు కూల్చుతుంటే ఈ ప్రాంత ఎంపీ ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి ఇద్దరూ కూడపలుక్కున్నారా? అని అడిగారు. పేదలకు కష్టం వస్తే అండగా ఉండేవాడే దేవుడని అన్నారు. రేవంత్ రెడ్డి నీవు మొగోడివైతే నీవు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ బ్రోకర్లు విడగొట్టే ప్రయత్నం చేస్తారని, మన హక్కులను లాక్కునే హక్కు ఎవరికీ లేదన్నారు. మీకోసం బీఆర్ఎస్ తరఫున కోర్టులో కొట్లాడుతామని భరోసానిచ్చారు. కేటీఆర్

'తెలంగాణల పెద్ద పండుగ అంటే దసరా. కానీ హైదరాబాద్‌లో లక్షలాది మంది పేదలకు నిద్రలేకుండా చేసింద్రు. ఎప్పుడు ఇండ్లు కూలగొడుతరో, ఎప్పుడు తమ ఇంటి మీదికి బుల్డోజర్ పంపుతరో అన్నట్టు భయపడుతున్నరు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో పేదలకు కంటిమీద కునుకులేకుండా పోయింది. మన హక్కులు మనం తెలుసుకున్నప్పుడు.. ఏ ప్రభుత్వం కూడా ఇష్టం వచ్చినట్లు మనమీదికి రాదు. రేవంత్ రెడ్డి అడ్డుమారిగుడ్డిగా ముఖ్యమంత్రి అయి పది నెలలు అయింది. హైదరాబాద్‌లో రేవంత్ రెడ్డి ఎవరూ ఓట్లు వేయలే. అందుకే ఇక్కడి ప్రజలపై పగబట్టిండు. పదినెళ్ల ముందట ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ ఇంట్లో ఒక్కరికే పింఛన్ ఇస్తున్నాడని, తాను ముఖ్యమంత్రికాంగనే ముసలవ్వ, ముసలయ్యకు ఇద్దరికీ పెన్షన్ ఇస్తానని చెప్పిండు. కేసీఆర్ రూ.2 ఇస్తున్నడు, నేను రూ.4 వేలు ఇస్తా అన్నడు. అత్తకేమే రూ.4 వేలు, కోడలుంటే రూ.2500 ఇస్తానన్నడు. ఆరు గ్యారంటీలు అన్నడు. మరి ఒక్కరికన్న వచ్చినయా రూ.2500,



రూ.4వేలు వచ్చినయా?. ఆడపడుచు పెండ్లికి రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తానడు.. కానీ తులం ఇనుమన్నా వచ్చిందా?. బంగారం రాదు. ఇనుము రాదు. మన్ను కూడా రాదు. ఇట్లా ఎన్ని కథలు చెప్పిండు.

రైతులకు రూ.15 వేలు ఇస్తానన్నడు. ఇచ్చిండా. ఆరు గ్యారంటీలు.. నూరు రోజులు అన్నడు. మూడొందల రోజులైంది. ఒక్కరికన్నా బుడ్డ పైసా అన్న వచ్చిందా. హామీలకు సంబంధి ఒక్క పైసా ఇవ్వలేదు. మూసీని రూ.లక్షా 50 వేల కోట్లతో సుందరీకరించి లండన్ లెక్క చేస్తాడట. ఇక్కడున్న పేదలను అడవిల పడేస్తాడట. మనమంతా చూస్తూ ఊరుకుందామా. ఇక్కడ 38 ఇండ్లకు ఆర్బీ ఎక్స్ అని రంగులు వేసిపోయింద్రట. పక్కింటికి రంగేసి పోతే నాకేంటని ఊకోవద్దు. ఇండ్ల మీదికి జేసీబీ వచ్చిన, బుల్డోజర్ వచ్చినా కంచె అడ్డం పెట్టండి. 40, 50 ఏండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నం. ఇండ్లు ఎలా కూలగొడుతరని ఆ బుల్డోజర్ డ్రైవర్‌ను అడగండి. ఇందిరమ్మ రాజ్యం అన్నరు. ఇందిరమ్మ చెప్పిందా.. సోనియమ్మ చెప్పిందా ఇండ్లు కూలగొట్టమని?. ఇందిరమ్మ ఇండ్లు కడతమన్నరు. ఇప్పుడు ఇండ్లు కూలగొతమంటున్నరు. ఇక్కడున్న ఇండ్లను కూలగొట్టి హోటల్ కడుతా, పార్కులు కడతా అంటే ఎవరికోసం?. గవర్నమెంట్లకు రాకముందు నల్లబిల్లులు కడుతా, కరెంటు బిల్లులు కడుతా అన్నడు. ఎప్పుడన్నా చెప్పిండా ఇండ్లు కూలగొడుతా అని. ఇండ్లు కూలగొడుతా అంటే ఓట్లు పడుతుండెనా?. మీరు గెలిపించిన ఎమ్మెల్యే ఇక్కడున్నడు. మరీ మీరు గెలిపించిన ఎంపీ ఎక్కడపోయిండు. కిషన్ రెడ్డి ఏడపోయిండు. గరీబోళ్లను లేపేయమని కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి కూడ బలుకున్నారా?. మీకు కష్టం వచ్చినప్పుడు ఎవరు మీతో ఉంటరో ఒక్కసారి అర్థం చేసుకోండి. ఎవరి నియ్యత్ ఏందో ఆలోచించండి. దేవుని పేరుచెప్పి ఓట్లేయించుకునుడు కాదు.. పేద ప్రజలే దేవుండ్లనుకుంటే వాళ్లకు కష్టం వచ్చినప్పుడు వాళ్లకోసం నిలబడేటోడు నాయకుడు. అంతేతప్ప దేవుని పేరుచెప్పుకుని ఓట్లేయించుకుని పదవులళ్ల కూర్చొని ప్రజలకు కష్టం వచ్చినప్పుడు తప్పించుకుని తిరిగోటోడు నాయకుడు ఎట్లయితడని కిషన్ రెడ్డిని అడుగుతున్న. ఇయ్యాల ఒక్క అంబర్‌పేట నియోజకవర్గంలోనే 16 వందల కుటుంబాలను రోడ్లపై పడేస్తున్నరు. కానీ బయటికి చెప్పే లెక్కలు వేరున్నయ్. లోపల అలగున్నయ్. సుమారు 40 వేల కుటుంబాలను అంటే లక్షన్నర మందిని రోడ్లమీద పడేసే ప్రయత్నం ఈ మూసీ ప్రాజెక్టు. ఎవడడిగిండు అసలు ఈ మూసీ ప్రెజెక్టును. గరీబోళ్లకు రూ.2500 ఇస్తాన్నవ్ అది ఇవ్వు. బతుకమ్మ చీరలు రెండిస్తా అన్నవ్. ఒక్కటీకూడా లేదు. రేవంత్ రెడ్డిని నమ్ముకుంటే ఒక్కటి కూడా ఉండవ్. గరీబోళ్లకు పనిచేయమని గద్దెనెక్కిస్తే.. ఇవాళ పేదోళ్ల ఇండ్లు కూలగొడుతా.. రోడ్డుమీద పడేస్తా అంటే ఇక్కడ చూస్తూ ఊకునేటోళ్లు ఎవ్వరు లేరు. భుజం భుజం కలిపి మీతో కలిసి కొట్లాడుతం. 2400 కిలోమీటర్ల నమామీ గంగ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ ప్రభుత్వం రూ.20 వేల కోట్లు ఖర్చుపెడితే.. 55 కిలోమీటర్ల మూసీ ప్రాజెక్టుకు రేవంత్ రెడ్డి రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు పెడ్తడట. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ.4 వేల కోట్లతోని మూసీ శుద్ధి చేసేందుకు ఎస్టీపీ ప్రాజెక్టులు ప్రారంభించాం. అదేవిధంగా మూసీపై 540 కోట్లతో 15 బ్రిడ్జిలు మంజూరు చేసినం.

బీఆర్ఎస్ హయాంలో ఇదే ప్రాజెక్టుకు రూ.16 వేల కోట్లు అవుతాయని లెక్కగట్టాం. కానీ ఒకేసారి పది రెట్లు ఎలా పెరిగింది? దీనికి సమాధానం చెప్పేటోడు లేదు. ఇండ్లు కూలగొడతామంటే తాము ఊరుకునేది లేదు. శంకర్‌నగర్‌లో ఇండ్లు కూలగొడుతున్నరట. రేవంత్ రెడ్డికి ఏమన్నా సిగ్గుంటే.. నిన్ననే హైకోర్టు చెప్పింది. ఇండ్లు కూలగొట్టదని. రేవంత్ రెడ్డి నువ్వు మొగోనివైతే ముందు ఆరు గ్యారంటీలు అమలు చేయ్. ఆడపిల్లలకు ఇస్తానన్న నెలకు రూ.2500 ఇవ్వు. ముసలోళ్లకు రూ.4 వేలు ఇవ్వు. రైతులకు రుణమాఫీ చెయ్. రైతుబందు రూ.15 వేల ఇవ్వు. ఆటో డ్రైవర్లకు బోర్డు పెడతా అన్నవ్ ముందు అది చెయ్. పేదవాళ్లను ఆదుకో. దమ్ముంటే గరీబోళ్లకు 2 లక్షల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టు. కానీ ఉన్న ఇంట్ల నుంచి తీసుకెళ్లి బయట పడేస్తామంటే ఊరుకునే లేదు. కాంగ్రెస్‌ల్లు నలుగురు బ్రోకర్‌గాళ్లు వస్తరు.. మిమ్మల్ని విడగొట్టే ప్రయత్నం చేస్తరు. ఏ బ్రోకర్‌ను నమ్మొద్దు. మీ ఇళ్లను కాపాడుకోవాలంటే ఐక్యమత్యంతో ఉండాలి. మిమ్మల్ని ఎవరు ముడుతడో తామంతా చూస్తామని.. ఒక్క కాల్ కొడితే తామంతా ఒస్తాం. మీరు ఎంత గట్టిగ నిలబడితే.. మీ ఇండ్లు అంతే గట్టిగ నిలబడుతయ్. మున్సిపల్ ఎన్నికలప్పుడు ఓటుతో జాడిచ్చి కొట్టాలి. మీ హక్కులు మీ దగ్గర గుంజుకునే హక్కు ఎవరికీ లేదు. కేసీఆర్ మీకు అండగా ఉన్నడు. మీ ఇండ్లు పోకుండా చూసుకునే బాధ్యతా మాది. ఆర్‌బీఎక్స్ అని ఉంటే దానిని తుడిపేసి కేసీఆర్ అని రాయండి. రేవంత్ రెడ్డి లాంటోడు మంచి మాటకు వినడు.' అని కేటీఆర్ అన్నారు.

## మూసీ అభివృద్ధిని అడ్డుకుంటే ప్రత్యక్ష ఉద్యమమే..

-మొదటిపేజీ తరువాయి

గ్రౌండ్ వాటర్‌లో ఫ్లోరైడ్ ఎక్కువని తెలిపారు. పది సంవత్సరాలు పాలించి లక్షల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. మూసీలో పారేది విషపు నీళ్లని.. తెలంగాణ వచ్చాక మూసీ స్థితి మారుతుందని అనుకున్నామన్నారు. మూసీ కోసం కేటీఆర్ వెయ్యి కోట్ల అప్పు తెచ్చారన్నారు. అయితే మూడు నాలుగు కోట్లు పెట్టి వాళ్లు విల్లా కొనుక్కుంటే.. గుడిసె వేసుకుని నివాసం ఉంటున్న వాళ్లు మూసీ పక్కన ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

**మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు...**


కేసీఆర్‌కు అసెంబ్లీకి వచ్చే మొఖమే లేదన్నారు. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వచ్చి మూసీ ప్రక్షాళనపై మాట్లాడాలన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే లేవకుండా చేస్తానన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకులు కాదని.. రాజకీయ నాయకులే అంటూ వ్యాఖ్యలు చేశారు. "కేసీఆర్, కేటీఆర్ మా ఊరిలో బస చేద్దాం. మా ఊరిలో టిఫిన్ కూడా చేయలేవు" అంటూ.. మాయమై పోతున్నడమ్మ మనిషిన్నవాడు అనే పాటను మంత్రి గుర్తు చేశారు. "మీరు మనుషులేనా? కనీసం మానవత్వం లేదా? మూసీ డెవలప్‌మెంట్ బోర్డు అన్నావ్ కదా ఏమైంది? లక్షల కోట్లు సంపాదించావ్.. పేదలపై కొంచెం కూడా జాలి లేదా? కాళేశ్వరం ఒక తుగ్లక్ పని.. మల్లన్న సాగర్ నిర్వాసితులను గత ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టిందో చూశాం.. మూసీ పరిస్థితి ఎలా ఉందో కేసీఆర్ దగ్గర ఓఎస్‌డీగా పనిచేసిన ప్రియాంక వర్గీస్‌ను అడగండి. మల్లన్న సాగర్ నిర్వాసితులను పోలీసులతో ఎందుకు కొట్టించారు. మూసీ ప్రక్షాళన చేస్తే కమిషన్ రాదని మొదలు పెట్టలేదా? పదేండ్లు అధికారంలో ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో అలా ఓడిపోవడానికి సిగ్గు లేదా?" అంటూ విమర్శలు గుప్పించారు.

# సోషల్ మీడియాపై కాంగ్రెస్ గుర్రు...

-మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా కథనాలు వస్తున్నాయి ఎక్కడ కూల్చివేతలు జరిగినా వాటిని హైడ్రాకు అంటగట్టిస్తున్నారు. కొన్నిచోట్ల హైడ్రాకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ అక్కడ కూలుస్తున్న రెవెన్యూ అధికారులను వదిలేసి వాటికి హైడ్రాకు ముడి పెడుతున్నారు. ఫలితంగా ఆక్రమణల తొలగింపు, మూసి ప్రక్షాళన కార్యక్రమాలపై హైడ్రా పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు మరింత దిగజారి ఇటీవల సోషల్ మీడియాలో ప్రత్యక్షమవుతున్న వార్తలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. అభ్యంతరమైన భాషతో కొందరు నేతలను టార్గెట్ చేసి వ్యక్తిగత విమర్శలు చేస్తున్న వీడియోలు ప్రత్యక్షమవుతున్నాయి. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ కాంగ్రెస్ నేతలను టార్గెట్‌గా చేసుకొని పెడుతున్న వీడియోలను వైరల్ చేస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం వీటిని సీరియస్‌గా తీసుకుంది. అదే పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్న యూట్యూబ్ ఛానెల్స్‌పై కఠినంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

వాస్తవ పరిస్థితులకు భిన్నంగా అసత్య ప్రచారాలు చేస్తూ పలు అంశాలకు కాంగ్రెస్ పార్టీని కార్నర్ చేసి కొన్ని యూట్యూబ్ ఛానల్ అదేపనిగా వీడియోలు తీస్తున్నారు. వీటితోపాటు తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పించడమే ధ్యేయంగా పెట్టుకొని, నోటికి వచ్చినట్లు కాంగ్రెస్ నాయకులను తిట్టిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో అలాంటి యూట్యూబ్ ఛానల్స్‌పై మరింత కఠినంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ సర్కార్ రెడీ అయ్యింది. అలాంటి వీడియోలు పోస్ట్ చేస్తున్న వారిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. గత కొద్ది రోజులుగా హైడ్రా పై తీవ్రస్థాయిలో ఫేక్ వీడియోలు సర్క్యులేట్ అవుతున్నాయి.



ఎక్కడ కూల్చివేతలు జరిగినా వాటిని హైడ్రాకు అంటగట్టిస్తున్నారు. కొన్నిచోట్ల హైడ్రాకు ఎలాంటి సంబంధం లేనప్పటికీ అక్కడ కూలుస్తున్న రెవెన్యూ అధికారులను వదిలేసి వాటికి హైడ్రాకు ముడి పెడుతున్నారు. ఫలితంగా ఆక్రమణల తొలగింపు, మూసి ప్రక్షాళన కార్యక్రమాలపై హైడ్రా పై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. కొన్ని యూట్యూబ్ ఛానళ్లు మరింత దిగజారి బాధితులు మాట్లాడిన దుర్భాషను ఎలాంటి ఎడిటింగ్ లేకుండా యూట్యూబ్ లలో అప్లోడ్ చేస్తూ వైరల్ చేసి ట్రెండింగ్ లో ఉండేలా చూస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మహిళా మంత్రులను టార్గెట్‌గా, వారిపై ఘోరమైన విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలలో వీడియోలు అప్లోడ్ చేస్తున్నారు. ఒక సీఎం హోదాలో ఉన్న వ్యక్తిపై అదే పనిగా తిట్టించడం, పైగా ఆ వీడియోను ఎలాంటి ఎడిటింగ్ చేయకుండా అలానే సోషల్ మీడియాలో పెడుతూ ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుంది. ఎక్కడో ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఘటనలు కూడా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆపాదిస్తూ సంబంధం లేని అంశాలకు రేవంత్ సర్కార్‌ను బదనాం చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

# సర్పంచ్‌గా పోటీ చేసే ఆశావాహులకు శుభవార్త

-మొదటిపేజీ తరువాయి

సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి అర్హులు అవుతారని రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తెలిపారు. ముగ్గురు పిల్లలు ఉండి సర్పంచ్‌గా పోటీ చేయాలి అనే వారికి రేవంత్ ప్రభుత్వం ఊరట కల్పించిందని అన్నారు. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులకు పిల్లల సంఖ్య బెడద తప్పింది. గతంలో ఇద్దరు పిల్లలు ఉన్న వారికి మాత్రమే పోటీ చేసే అవకాశం ఉండేది. ముగ్గురు అంతకన్నా ఎక్కువమంది పిల్లలు ఉంటే పోటీకి అనర్హులు. కానీ, 2019 మున్సిపల్ చట్ట ప్రకారం పిల్లలు ఎంతమంది ఉన్నా ఈ సారి పంచాయతీ ఎన్నికల్లో పోటీకి ఆటంకాలు లేవని రేవంత్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే అభ్యర్థులకు ఏఏ సందర్భాల్లో ఇందులో మినహాయింపులతో కూడిన వెసులుబాట్లు లభిస్తాయి అన్న విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంది. కాగా, గతంలో పంచాయతీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థికి ముగ్గురు పిల్లల విషయంలో అనర్హతకు సంబంధించిన చట్టం 1994 మే 30 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ తేదీకి ముందు ఎంత మంది పిల్లలున్నా అర్హులవుతారు. చట్టం అమల్లోకి వచ్చిన ఒక సంవత్సరంలోగా అంటే 1995 మే 29 లోగా మూడో బిడ్డ పుట్టినా అనర్హులు కాకుండా కూడా మినహాయింపు ఉంది. 1995 మే 30 ఆ తర్వాత జన్మించే పిల్లలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. దత్తత తీసుకున్న పిల్లలతో సహా ఇద్దరికి మించినట్లయినా అర్హులే అవుతారు. దత్తతకు సంబంధించిన పిల్లలు అసలు తల్లిదండ్రుల లెక్కలోనే ఉంటారు. ఈ మేరకు 2006లో హైకోర్టు కూడా ఈ తీర్పు ఇచ్చింది. అదే విధంగా అభ్యర్థికి ముగ్గురు పిల్లలు ఉండి ఒకరిని దత్తత ఇచ్చేసినా అనర్హులే అవుతారు. అభ్యర్థి మొదటి భార్య ద్వారా ఇద్దరు పిల్లలను కలిగి రెండో భార్య ద్వారా మరో బిడ్డను జన్మనిస్తే అనర్హుడి




కిందే లెక్క. అయితే మొదటి భార్య ఒక బిడ్డను మాత్రమే జన్మనిస్తే రెండో భార్యకు మాత్రం అనర్హత వర్తించదు. నామినేషన్ వేసే నాటికి ముగ్గురు పిల్లలు ఉండి, పరిశీలన జరిగే రోజుకు అందులో ఒకరు చనిపోయినా కూడా అర్హుడవుతారు. ఇదివరకే ఇద్దరు పిల్లలు కలిగి ఉండి మూడోసారి గర్భం ధరించినా.. అధికారులు పిల్లల లెక్క పరిశీలన కోసం వచ్చే తేదీ నాటికి ఇద్దరే పిల్లలున్నందున అర్హులు అవుతారు. 1995 మే 29 నాటికి ఒక బిడ్డ మాత్రమే ఉండి ఆ తర్వాత ఇద్దరు కవలలు పుట్టినా అర్హుడేఅవుతారు. ఆ తేదీతో నిమిత్తం లేకుండా మొదటి కాన్పులో ఒక బిడ్డ కలిగి తర్వాత కవలలు జన్మించినా అర్హులే అవుతారు. అయితే మొదటి కాన్పులో కవలలు కలిగిన తర్వాత మరో బిడ్డ జన్మనిస్తే అనర్హుడవుతారు. అదే విధంగా ఒకే కాన్పులో ముగ్గురు పుట్టినా పోటీ చేయడానికి అనర్హత వర్తించదు.

## రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు

-మొదటిపేజీ తరువాయి

చేసిన క్రాసింగ్ ఏర్పాటును పరిశీలించారు. హైదరాబాద్‌లో అత్యంత రద్దీగా ఉండే కూడళ్లలో షిబుయా తరహా ట్రాఫిక్ నియంత్రణ పద్ధతిని అమలు జరపనున్నామని భట్టి తెలిపారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ బలరామ్ ఆయన వెంట ఉన్నారు.

## 3వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం

-మొదటిపేజీ తరువాయి

నుండి చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో తెలంగాణ మత్స్యశాఖ తరుపున చేపల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. జిల్లాలో మంత్రులు ,విప్ లు , ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ,ఎంపిలు కార్పొరేషన్ చైర్మన్ లు , ప్రభుత్వ సలహాదారులు మత్స్య కార్మిక కుటుంబాలకు అండగా ఉండే విధంగా చేపల పంపిణీ కార్యక్రమం లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో వెలుగులు నింపేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా చెరువుల్లో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. చెరువుల్లో వేసే దానిలో నాణ్యమైన చేప పిల్లల పంపిణీ చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. చేప పిల్లల పంపిణీ గ్రామాల్లో ఒక పండగ వాతావరణంలో జరగాలని సూచించారు. అన్ని చెరువులు , ప్రాజెక్ట్ లు జలకళ సంతరించుకోవడంతో చేప పిల్లల పంపిణీ భవిష్యత్ లో మత్స్యకారుల కుటుంబాల్లో సిరులు కురవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ తో పాటు , డైరెక్టర్ ప్రియాంక అలా చేప పిల్లల పంపిణీ కార్యక్రమంకి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## కేటీఆర్ కారుపై కాంగ్రెస్ గూండాల దాడి.. రాహుల్‌గాంధీని నిలదీసిన హరీశ్‌రావు



మూసీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారుపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడంపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లిన హరీశ్‌రావు.. మీరు చెప్పిన విధ్వంసకర బజార్‌లో ప్రేమ దుకాణం అంటే ఇదేనా అని విమర్శించారు.

మూసీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న కేటీఆర్‌పై కాంగ్రెస్ రౌడీ మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. ప్రజా సమస్యల పట్ల పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల మీద దాడులు చేయడమేనా ప్రజా పాలన అంటే అని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధుల ఇళ్ల మీద దాడులు, నాయకుల అరెస్టులు, అక్రమ కేసులు.. ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని నిలదీశారు. కేటీఆర్‌పై దాడికి తెగబడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ డీజీపీని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్)లో తీవ్రంగా స్పందించారు. తెలంగాణలో కాంగ్రెస్ విఫలమైందని పేర్కొన్నారు.

**అసలేమైంది?**

మూసీ– హైడ్రా బాధితులకు అండగా నిలబడ్డారని ఇప్పటికే హైదరాబాద్ తెలంగాణ భవన్ వద్ద ఆందోళనకు దిగిన కాంగ్రెస్ కార్యకర్తలు.. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారుపైనా దాడికి తెగబడ్డారు. గోల్నాక మూసీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా ముషీరాబాద్‌లో కేటీఆర్ కారును అడ్డుకున్నారు. ఆపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది, బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ గూండాలు ఏ మాత్రం తగ్గలేదు. కొందరైతే ఏకంగా కారుపైకి ఎక్కి మరీ దురుసుగా ప్రవర్తించారు. చివరకు బీఆర్ఎస్ శ్రేణులు వారిని తన్ని తరిమివేశారు. అనంతరం అంబర్‌పేట గోల్నాక పరిధిలోని తులసీరామ్ నగర్ వెళ్లిన కేటీఆర్ అక్కడ మూసీ బాధితులను పరామర్శించారు.

## సమస్యను జఠిలం చేసేలా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది

-మొదటిపేజీ తరువాయి

తీసుకున్న నిర్ణయాలను మరిచిపోయి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 2017లో బీఆర్ఎస్ హయాంలోనే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు అయ్యిందని ఆయన ప్రస్తావించారు. కాలుష్య నివారణకు, రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయాలని 2017 కార్పొరేషన్ ఏర్పాటు చేశారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

"బీఆర్ఎస్ హయంలోనే ఆక్రమణలు, అక్రమ కట్టడాలు ఎన్ని ఉన్నాయో తేల్చాలని చెప్పారు. బఫర్ జోన్ బౌండరీలు నిర్ధారణ చేయాలని ఆదేశించారు. అక్కడ ఉన్నవారిని పంపించాలని తీర్మానించారు. 2020లో కేటీఆర్ మంత్రిగా ఉండగా బఫర్ జోన్ నిర్ధారించి ఇళ్లు కూల్చాలని నిర్ణయించారు. 2021లో మరో మీటింగ్ పెట్టి అక్రమ కట్టడాలు కూల్చాలని ఆదేశించారు. 2022లో మరో మీటింగ్ పెట్టి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని చెప్పారు" అని పేర్కొన్నారు.

"మూసీకి రెండు వైపులా 55 మీటర్లు రోడ్లు వేయాలని, 50 మీటర్లు బఫర్ జోన్‌గా గుర్తించాలని 2016లోనే జీవో 7 తీసుకొచ్చారు. యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు కూల్చాలని చెప్పారు. లక్షా 50 వేల క్యూసెక్కుల కంటే ఒక్క క్యూసెక్కు ఎక్కువ వచ్చినా ప్రాణ నష్టం జరుగుతుందని 2019లో ఓ సర్వే తేల్చింది. ఆనాడు మీరు ఆలోచన చేస్తే మంచిది. ఈ రోజు మేము మంచి నీరు, గాలి ఇవ్వాలనుకోవడం తప్పా?. మంచి ఆలోచనతో పని చేపడుతున్నాం. సమస్యను జఠిలం చేసేలా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోంది. కాళేశ్వరం, మల్లన్న సాగర్ భూ నిర్వాసితుల విషయంలో ఆనాడు మీరు ఎందుకు కనికరం చూపలేదు. అధికారం పోయి ఏం చేయాలో తోచక బురద చల్లుతున్నారు. కింది స్థాయి అధికారులు పొరపాట్లు చేస్తే ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుంటుంది. ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశ్యం మాకు లేదు" అని మంత్రి శ్రీధర్ బాబు క్లారిటీ ఇచ్చారు.

## రూ.2.80 కోట్ల విలువ చేసే గంజాయి దగ్ధం




**ఖమ్మం :** గంజాయి కట్టడికి అధికారులు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎక్కడి కక్కడ తనిఖీలు చేస్తూ గంజాయిని సీజ్ చేస్తున్నారు. తాజాగా ఖమ్మం జిల్లాలో భారీగా గంజాయిని ఎక్సైజ్ అధికారులు దగ్ధం చేశారు. వివరాల్లోవెళ్తే .. జిల్లాలోని ఆరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 72 కేసుల్లో పట్టుకున్న 1120 కేజీల గంజాయిని ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి పర్యవేక్షణలో మంగళవారం దగ్ధం చేశారు. ఎవరైనా గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. యువత గంజాయి వంటి అన్ని రకాల మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# దేవిమాత మండపాలకు పట్టుచీరాల పంపిణీ చేసిన అర్బన్ ఎమ్మెల్యే





**కామారెడ్డి, అక్టోబర్ 01శుభ తెలంగాణ** నిజామా బాద్ జిల్లా కేంద్రంలో ధన్ పాల్ లక్ష్మీబాయ్ మరియు విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్వాడి గల్లీ డి ఎస్ ఎన్ కార్యాలయంలో నిర్వహించిన పట్టుచీరాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే, ధన్ పాల్ లక్ష్మీ బాయ్ %డ%విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ధన్ పాల్ సూర్యనారాయణ గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తు దేవి నవరాత్రుల సందర్భంగా ఇందూర్ నగరంలోని దాదాపు 250 మండపాలకు పట్టుచీరలు పంపిణీ చేయ డం జరిగిందన్నారు గత 11 ఏళ్ల నుండి తన ట్రస్ట్ ద్వారా ఈ సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుం దన్నారు, హిందూ ధర్మంలో శరన్నవరాత్రి పండుగకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందన్నారు, చెడుపై మంచి సాధిం చిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుం టారని,ఈ పండుగ దుర్గాదేవికి అంకితం చేయబడిందని హిందూ బంధువులు అంత ఐక్యతతో,భక్తి శ్రద్దలతో నిర్వహించే దేవి నవరాత్రులకు తమ వంతు సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు.హిందూ ధర్మరక్షణకు, హిందూ సంస్కృతి, సంప్రదా యాలను పెంపొందించే ప్రతి కార్యానికి తన ట్రస్ట్ ద్వారా సేవాలాందించడానికి ముందుంటమన్నారు, అమ్మ ఆశీర్వాదం ఉంటే అన్ని ఉన్నట్లే అని రాష్ట్ర ప్రజలం దరు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని రైతన్నలు సకాలంలో వర్షాలు కురిసి అధిక పంటలు పండించి సుభిక్షంగా ఉండాలన్నారు.. ఈ కార్యక్రమంలో ధన్ పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్త ట్రస్ట్ సభ్యులు, బిజెపి నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సెలెంట్ బాషా హై స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు...

ముఖ్య అతిథులుగా ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్, ఎక్సలెంట్ గ్రూప్స్ చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్ పాల్గొన్నారు..






**అక్టోబర్ 1 భద్రాద్రి కొత్తగూడెం శుభ తెలంగాణ** పినపాక:ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు లో గల ఎక్సెలెంట్ భాష హైస్కూల్ లో బతుకమ్మ వేడుకలను విద్యార్థులు,ఉపాధ్యాయుల నడుమ ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బతుకమ్మ పాటలకు సాంప్రదా య వస్త్రాలు ధరించిన విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి ఆడి పాడారు.విద్యార్థులు ఆటపాటలతో పాఠశాల పండగ వాతావరణంల తయారైంది. విద్యార్థి నులు, పాఠశాల ఆవరణంలో బతుకమ్మ పాటలకు కోలాటం డ్యాన్స్ లు ప్రదర్శించారు. కోలాటలు, నృత్యం ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడూళ్ల బయ్యారం ఎస్సై ఈ రాజ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు సాంస్కృతిక కార్యక్రమాలలో మంచి ప్రదర్శన కనబర్చాలని అన్నారు. అలాగే విద్యార్థులకు పండగల విశిష్టత గురించి తెలియజేస్తు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎక్సెలెంట్ గ్రూప్స్ చైర్మన్ ఎండీ ఖాదర్, ఎండీ యాకుబ్ షరీఫ్, డైరెక్టర్స్ ముక్కు నర్సారెడ్డి, బండారు నరేంద్ర, ప్రిన్సిపాల్ అంకం సురేష్, సీనియర్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్దులు ఆరోగ్యవంతంగా ఉంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

## జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







**కామారెడ్డి, శుభ తెలంగాణ :** కామారెడ్డి జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ వయో వృద్దుల దినోత్సవం సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని వయో వృద్ధుల ఫోరం భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వృద్దులు ఆరోగ్యవంతంగా ఉండాలని, తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వారం రోజుల పాటు అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాలను నిర్వహించుకోవడం జరిగిందని అన్నారు. తల్లి దండ్రులను సరిగా చూడని వారికి చట్టం అండగా నిలుస్తుందని తెలిపారు. తల్లిదండ్రులను పోషించనీ వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. వృద్దులు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. యోగ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ప్రతీ రోజూ నడక, వ్యాయామం చేయాలని తద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపా రు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ మాట్లాడుతూ, వృద్దులు తమ మనుమలు, మనుమరాళ్ళతో కాలక్షేపం చేయాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి బాబయ్య మాట్లాడుతూ, వయోవృద్దులను చిన్న పిల్లల్లా చీసుకోవాలనీ, ఆప్యాయంగా పలకరించాలని అన్నారు. వృద్ధులను గౌరవించిక్షోవాలనై అన్నారు. నిరాదరణకు గురి అయిన వృద్దులకు చట్టం అండగా నిలుస్తుంది తెలిపారు. యోగ, వాకింగ్, క్యారం వంటి పోటీలను ఈ సందర్భంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం పలువురు వృద్ధులను శాలువాలతో సత్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ మెమొంటోలు అందజేశారు. వృద్ధుల సంక్షేమ ఫోరం ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దలకు విలువ, గౌరవం ఇవ్వాలి

**నల్గొండ :** వయో వృద్ధులు లేని సమాజం ఉండదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర అన్నారు . జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెద్దల దినోత్సవం జరుపుకున్నంత మాత్రాన సరిపోదని, వారికి సరైన విలువ, గౌరవాన్ని ఇచ్చినప్పుడే అది సార్ధకం అవుతుందని అన్నారు. "మీరు లేని సమాజం ఊహించలేనిది. సమాజంలో మీది ఉత్కృష్ట భాగం.మీ కృషివల్లే సమాజం కొనసాగుతోంది" అని ఆయన అన్నారు. సమాజానికి ప్రతి ఒక్కరు సేవ చేసినట్లుగానే వయోవృద్ధుల సేవను సైతం మర్చిపోలేము అని తెలిపారు. కుటుంబ పెద్దలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ,వారిని గుర్తించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వయో వృద్ధుల సంక్షేమానికి సంబంధించి 2007లో వచ్చిన చట్టం కొద్దిపాటి మాత్రమే ఉపశమనం కల్పించిందని చెప్పారు. జిల్లాలో వయవృ ద్ధులకు సంబంధించి 280 కేసులు నమోదయాయని, వాటిని త్వరగా పరిష్కరించాలా తెలిపారు. మండల స్థాయిలో వయోవృద్ధుల కమిటీల ఏర్పాటు, వారికి చికిత్స తదితర విషయాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తుందని టర్లపారు. ఈ సందర్భంగా ఆయన వయోవృద్ధులను సన్మానించారు.


## అరుణోదయ విద్యాలయంలో బతుకమ్మ వేడుకలు



**అక్టోబర్ 1 భద్రాద్రి కొత్తగూడెం శుభ తెలంగాణ:** తెలంగాణ సంస్కృతి సాంప్రదా యాలతో కూడిన బతుకమ్మ పండుగను అరుణోదయ విద్యాలయంలో 1/10/2024 ఘనంగా ఆటపాటలతో ఎంత ఉత్సాహంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ ఉద్దేశించి కరస్పాండెంట్ మాదాస్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు బతుకమ్మ పండుగ గురించి చెబుతూ పకృతి సమ్మేళనంతో కూడిన బతుకమ్మ పండగ విశిష్టత గురించి వివరించారు ఈ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ప్రశంసలు తెలియజేశారు. ఇట్లు కరస్పాండెంట్ మాదాస్ అరవింద్ కుమార్ అరుణోదయ విద్యాలయం


## మణుగూరు అంబులెన్స్‌ల నిర్వహణకు టెండర్ల గడువు పొడిగింపు-

డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్



**అక్టోబర్ 1 భద్రాద్రి కొత్తగూడెం శుభ తెలంగాణ):** సింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలోని ఏరియా హాస్పిటల్ మరియు పీకేఓసి నందు నిర్వాహణ కొరకు ఏసీ అంబులెన్స్ కొరకు టెండర్లను కోరడమైనది. మొదటిగా ప్రకటించిన చివరి తేదీ 26.09.2024 అభ్యర్థుల సౌకర్యార్థం కోసం పైన పేర్కొన్న తేదీని పొడిగించి 03.10.2024 సాయంత్రం 4.30 వరకు దరఖాస్తులు స్వీకరించబడునని తెలియజేయడమైనది. క్రమ సంఖ్య 1.2.వాహన రకం వాహన ఖాళీల సంఖ్య 2 ,1 నెలవారి కి. మీటర్లు రోజుకు కేటాయించిన వాహన గంటలు కాలపరిమితి కేటాయించిన గనుల / విభాగాలు ఏసి అంబులెన్స్ 1000 కి. మీటర్లు 24 గంటలు 5 సంవత్సరాలు ఏరియా హాస్పిటల్, మణుగూరు ఏరియాఅంబులెన్స్ 1000 కి. మీటర్లు 24 గంటలు 5 సంవత్సరాలు పీకేఓసి, మణుగూరు ఏరియా వాహన టెండర్ దరఖాస్తులకు అర్హులు: కేటగిరీ -1గా ఓసి ప్రభావిత నివాసులు, భూ నిర్వాసితులు. (వీరికి మొదటి ప్రాధాన్యత)కేటగిరి -2గా సింగరేణి మాజీ ఉద్యోగులు, సింగరేణి మాజీ ఉద్యోగుల పిల్లలు అర్హులు. ( కేటగిరీ-1 వారు రాని యెడల వీరికి ప్రాధాన్యత ఇవ్వబడును.కేటగిరీ -3 అనగా కేటగిరీ -1గా మరియు కేటగిరి -2 వారు రాని యెడల మిగితా వారికి అవకాశం ఇవ్వబడును. పూర్తి వివరాల కొరకు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. ఎస్ సి సి ఎల్ మైన్స్. కామ్ వెబ్ సైట్ లో టెండర్ నోటీస్ మెటిరీయల్ ప్రొక్యూర్మెంట్ ఏరియా టెండెర్స్ నందు పొందుపర్చడమైనది. కావున, దరఖాస్తుదారులు తగిన ధృవీకరణ పత్రాలు మరియు ఆధారాలతో సంప్రదించి దరఖాస్తు చేసుకొనగలరు. వివరాలకు మణుగూరు ఏరియా జిఎం కార్యాలయంలోని పర్చేస్ విభాగం నందు సంప్రదించగలరు.

## బొంత రామ్మోహన్ మాతృమూర్తికి ఘన నివాళులు అర్పించిన మాజీ మంత్రి హరీష్ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**(శుభ తెలంగాణ/హైదరాబాద్)** మాజీ మేయర్ బొంత రామ్మోహన్ మాతృమూర్తి మరణం గురించి తెలియగానే రాజకీయ ప్రముఖులు తీవ్ర సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ విషాద వార్త వెలువడగానే,వివిధ రాజకీయ పార్టీల నాయకులు మరియు ప్రముఖులు వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు చర్లపల్లిలోని బొంత రామ్మోహన్ నివాసానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా,మాజీ మంత్రి హరీష్ రావు,ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మరియు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇంద్రయ్య బొంత రామ్మోహన్ తల్లికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ,"తల్లి మరణం అనేది మన జీవితంలో అత్యంత బాధాకరమైన సంఘటన.మాతృ ప్రేమకు సమానమైన ప్రేమను మనం ఎక్కడా పొందలేము.ఈ విషాద సమయంలో,భగవంతుడు రామ్మోహన్ కుటుంబానికి శాంతిని,ధైర్యాన్ని ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అని అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ "బొంత రామ్మోహన్ మాతృమూర్తి మరణ వార్త తెలిసిన వెంటనే,నా హృదయం తీవ్ర విషాదంతో నిండిపోయింది.తల్లి కోల్పోవడం అనేది మన జీవితంలో అత్యంత దుర్భరమైన సంఘటన.మాతృ ప్రేమ అనేది అసాధారణమైనది,దానికి సమానమైనది ఈ సృష్టిలో ఇంకెక్కడా కనిపించదు"అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు మరియు ఇతర రాజకీయ ప్రముఖులు కూడా పాల్గొన్నారు.వారు రామ్మోహన్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు మరియు వారి తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# వయోవృద్ధులకు పిల్లలు సమయం కేటాయించాలి



**కరీంనగర్‌శుభ తెలంగాణ :** వృద్ధుల కోసం వారి పిల్లలు వీలైనంత సమయాన్ని కేటాయించాలని వారికి ప్రేమను పంచాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.మహిళలు, పిల్లలు వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. పిల్లలు తల్లిదండ్రులను అనుసరిస్తూ, అనుకరిస్తూ ఉంటారని అన్నారు. అందువల్ల వృద్ధులను వారి పిల్లలు ఎలా చూసుకుంటే భవిష్యత్ తరాలు అలాగే ప్రవర్తిస్తాయని తెలిపారు. ప్రతి వ్యక్తి జీవితంలో వయసును బట్టి వారు పోషించాల్సిన పాత్ర మారుతూనే ఉంటుందని అన్నారు. వృద్ధాప్యంలోనూ పిల్లలు, ఆస్తులు వంటి విషయాలను ఆలోచించకుండా వృద్ధులు తమకోసం తాము జీవించాలని అన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాయామం, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. వృద్ధులు తమ ఆస్తులను పిల్లలకు ఇచ్చేటప్పుడు తమకంటూ కొంత ఆస్తిని తమ వద్దే ఉంచుకోవడం మంచిదని సూచించారు. ఎంతో అనుభవం ఉన్న వృద్ధులు సమాజ అభివృద్ధికి మార్గదర్శకాలను సూచించాలని కోరారు. ట్రైనీ కలెక్టర్ ప్రపుల్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ప్రశాంతమైన జీవనం గడపాలని అన్నారు. వృద్ధుల పట్ల పిల్లలు ప్రేమ, వాత్సల్యం చూపాలని సూచించారు. ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ వృద్ధుల సమస్యలకు సంబంధించి తమ వద్దకు వచ్చిన కేసులను ఏ సమయంలోనైనా పరిష్కరిస్తున్నామని తెలిపారు. తాము ఇచ్చిన ఉత్తర్వులను పాటించకపోతే పోలీసు చర్యకు వెనుకాడబోమని అన్నారు. ఇకనుండి ప్రతి శనివారం వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లోనే వృద్ధుల కేసులను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా వృద్ధుడు రాపర్తి వెంకటేశం స్వయంగా పెన్సిల్ తో గీసిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చిత్రాన్ని కలెక్టర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, వయోవృద్ధుల సంఘాల బాధ్యులు సముద్రాల జనార్దన్ రావు, కేశవరెడ్డి, మోసం అంజయ్య, నసీరుద్దీన్, బండ సత్తయ్య పాల్గొన్నారు.

## పెద్దలకు విలువ, గౌరవం ఇవ్వాలి



**నల్గొండ శుభ తెలంగాణ :** వయో వృద్ధులు లేని సమాజం ఉండదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర అన్నారు . జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెద్దల దినోత్సవం జరుపుకున్నంత మాత్రాన సరిపోదని, వారికి సరైన విలువ, గౌరవాన్ని ఇచ్చినప్పుడే అది సార్థకం అవుతుందని అన్నారు. “మీరు లేని సమాజం ఊహించలేనిది. సమాజంలో మీది ఉత్కృష్ట భాగం.మీ కృషివల్లే సమాజం కొనసాగుతోంది” అని ఆయన అన్నారు. సమాజానికి ప్రతి ఒక్కరు సేవ చేసినట్లుగానే వయోవృద్ధుల సేవను సైతం మర్చిపోలేము అని తెలిపారు. కుటుంబ పెద్దలను గౌరవించుకోవాల్సిన బాధ్యత ,వారిని గుర్తించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.వయో వృద్ధుల సంక్షేమానికి సంబంధించి 2007లో వచ్చిన చట్టం కొద్దిపాటి మాత్రమే ఉపశమనం కల్పించిందని చెప్పారు. జిల్లాలో వయవృద్ధులకు సంబంధించి 280 కేసులు నమోదయాయని, వాటిని త్వరగా పరిష్కరించాలా తెలిపారు. మండల స్థాయిలో వయోవృద్ధుల కమిటీల ఏర్పాటు, వారికి చికిత్స తదితర విషయాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారిస్తుందని టర్లపారు. ఈ సందర్భంగా ఆయన వయోవృద్ధులను సన్మానించారు. వయో వృద్ధుల జిల్లా అసోసియేషన్ తరపున స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ను, అతిథులను సన్మానించారు. అడిషనల్ ఎస్ పి రాములు నాయక్,జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, డిఆర్ డి ఏ అడిషనల్ పి డి శారద,వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున రావు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వయో వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కసారిగా భారీ వాన

**హైదరాబాద్ శుభ తెలంగాణ :** జూబ్లీహిల్స్ లో మంగళవారం విచిత్రమైన పరిస్థితి కనిపించింది. ఉదయం నుంచి భీకరమైన ఉక్కపోత ఉండగా మధ్యాహ్నం తర్వాత ఒకవైపు ఎండ కొడుతూనే మరోవైపు భారీ వాన జూబ్లీహిల్స్ వాసులను పలకరించింది. సుమారు 15 నిమిషాల పాటు ఎండలోనే వాన కొట్టడంతో స్థానికులంతా విచిత్రంగా ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి కనిపించింది. మరోవైపు బంజారాహిల్స్ లో ఫిలింనగర్ లో అసలు వాన జాడనే లేకపోవడం గమనార్హం.

# కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ తోడ్పాటు

**రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్..**



**రాజన్న సిరిసిల్ల శుభ తెలంగాణ :** నేత కార్మికుల ద్వారా మహిళా సంఘాలకు చీరల పంపిణీ ప్రైవేట్ రంగంలో గల అవకాశాలను నేత కార్మికులు వినియోగించుకోవాలి.నేత కార్మికులు సమస్యలు వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, పెండింగ్ బకాయిలు, తదితర అంశాల పై రివ్యూ నిర్వహించిన ప్రిన్సిపల్ సెక్రెటరీ.నేత కార్మికులు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలని, దీనికి అవసరమైన సంపూర్ణ తోడ్పాటు ప్రభుత్వం అందిస్తుందని, ద్వారా నేత కార్మికులకు లాభం చేకూరుతుందని రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ అన్నారు. మంగళవారం వేములవాడ లో పర్యటించిన రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, అదనపు కలెక్టర్ లు స్వాగతం పలికారు. అనంతరం వేములవాడలో నేత కార్మికుల సమస్యలు , వస్త్ర పరిశ్రమ అభివృద్ధి, పెండింగ్ బకాయిలు, ఆర్డర్లు తదితర అంశాల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ, సిరిసిల్లలో ఎటువంటి సంక్షోభం ఉండవద్దని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారని, నేత కార్మికులు ఎవరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా ఎదగాలని ఆకాంక్షిస్తూ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. నూలు డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పెండింగ్ బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లించామని, మిగిలిన బకాయిలు ఉంటే వాటి చెల్లింపుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. తెలంగాణలోని మహిళ సంఘాలకు 2 చీరల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిందని, దీని ద్వారా నేత కార్మికులకు ఉపాధి లభిస్తుందని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు.తెలంగాణ సాంస్కృతి, చరిత్రను ప్రతిభింబించేలా మహిళా సంఘాల కు యూనిఫాం విధంగా ఆ చీర ఉండాలని ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నారని, దానికి కొత్త బ్రాండ్ ఇమేజ్ రావాలని అన్నారు. మహిళా గ్రూపులతో, చేనేత పరిశ్రమ ప్రతినిధులతో మాట్లాడామని , పాలిస్టర్ చీర జరీ అంచు ఉంటుందని అన్నారు. ఆధునికంగా ఉండే విధంగా చీరలు తయారు చేయాలని సీఎం ఆదేశించారని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు.సిరిసిల్ల జిల్లాలో స్వతంత్రంగా ఆ చీరలు తయారు చేసే అవకాశం కల్పించాలని ఆసాములు కోరడంతో ప్రభుత్వం ఈ సమావేశం ఏర్పాటు చేసి దానికి తగిన విధంగా చర్యలు చేపట్టిందని అన్నారు. నూలు డిపో పెట్టిన తర్వాత దాని తరలింపు బాధ్యత ఆసాముల దేనని అన్నారు. సొసైటీకి నూలు అప్పగించిన తర్వాత లాభాలను సేట్లు, ఆసాములు, వర్కర్లు ఎలా తీసుకుంటారు అనే అంశాలను వివరించాలని అన్నారు. ప్రస్తుతం వచ్చే లాభం అధికంగా ఆసాములకు చేరాలని ప్రభుత్వం భావిస్తుందని అన్నారు. 100% దీని పైన ఆధారపడకుండా ప్రైవేట్ మార్కెట్ లో కూడా చేనేతలు రాణించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. హైదరాబాద్ లో కోఠి,బేగం బజార్ ప్యారడైస్ చుట్టు పక్కల ఉన్న ప్రాసెసింగ్ యూనిట్ సూరత్ నుంచి తెచ్చి ప్రింటింగ్ చేస్తున్నారని, మన సిరిసిల్ల చేనేతలు అవకాశాలు అంది పుచ్చుకోవాలని , అవకాశాలను చేనేతలు అందుపుచ్చుకోవాలని ప్రిన్సిపల్ కార్యదర్శి సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. చేనేత రంగంలో అనుభవం కలిగిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక శ్రద్ధ వహించి సిరిసిల్ల జిల్లా పరిధిలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని అన్నారు. చేనేత సమస్యల పట్ల ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, గత ప్రభుత్వం పెట్టిన 190 కోట్ల బకాయిలను విడుదల చేశారని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న టెస్కో జీఏం మాట్లాడుతూ. ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త పథకాల వల్ల దీర్ఘకాలంలో నేత కార్మికులకు లాభం చేకూరుతుందని అన్నారు. గతంలో కేవలం వైట్ క్లాత్ మాత్రమే తయారు చేశారని, అక్కడి నుంచి పీసీ, కలర్, జరీ అంచు చీరలు, జకాడ్ క్రమక్రమంగా మార్పు సాధించామని, ఈ మార్పు ఇంకా ముందుకు తీసుకొని వెళ్లాలని అన్నారు. నేత కార్మికులు సొంత కాళ్ళ మీద నిలబడాలని అన్నారు. సంఘ అధ్యక్షులకే కాకుండా ఆసాములకు కూడా లాభం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. టెస్కో అందించే ఆర్డర్లను చేస్తూనే ప్రైవేట్ రంగంలో గల అవకాశాలను చేనేతలు అందిపుచ్చుకోవాలని , హైదరాబాదులో ప్రతిరోజు లక్షల మీటర్ల ఆర్డర్లు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని, వీటిని చేనేతల సాధించాలని అన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ఆసాములు మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన అవకాశాలను వాడుకుంటామని వచ్చే లాభాలను సంఘంలోని సభ్యులంతా సమానంగా పంచుకుంటామని, నూలు డిపో ఏర్పాటు వల్ల మంచి జరుగుతుందని అన్నారు.అదేవిధంగా ఆ సమయంలో తమ వద్ద పని చేసే కార్మికులకు సైతం లాభం చేకూరుస్తామని అన్నారు.

ఈ సమవేశం లో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, టెస్కో జీఎం అశోక్ రావు, ఏడీ హ్యాండ్లూమ్స్ సాగర్, నేత కార్మిక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి



**సిద్దిపేట శుభ తెలంగాణ :** ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను వేగవంతం చెయ్యాలని జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దిపేట మున్సిపాలిటీలోని రంగధాంపల్లి పరిధిలో గల మారుతీ నగర్ వెంచర్ లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొబైల్ ఫోన్ లో ఎల్ఆర్ఎస్ యాప్ ద్వారా అప్లోడ్ ప్రక్రియ గుర్చి జిల్లా కలెక్టర్ అడగ్గా మారుతీ నగర్ వెంచర్ గల 175 స్క్వేర్ యార్డు విస్తీర్ణం గల ఒక ఓపెన్ ప్లాట్ అక్కడ లోకేషన్ తో అప్లోడ్ చేసే విధానం గుర్చి క్లుప్తంగా అధికారులు వివరించారు. స్టేప్ బై స్టేప్ కన్వర్షన్, అప్లికేషన్ చార్జీల గుర్చి అడిగారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పలు విభాగాలు పూర్తి చేయడానికి సర్వర్ ప్రాబ్లమ్, ఓపెన్ ప్లాట్ ఓనర్ సరిగ్గా రెస్పాన్స్ ఇవ్వకపోవడం, ఇతరత్రా ఇబ్బందుల వలన ఆలస్యం అవుతుందని, లోకేషన్ లోనే పోటో తిసి అప్లోడ్ చేస్తేనే యాప్ లో అప్లోడ్ అవుతుందని కలెక్టర్ కి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిద్దిపేట మున్సిపాలిటీ లో సూమారు 10 వెంచర్లలో దాదాపు 32000 ప్లాట్స్ అప్లికేషన్లు ఉన్నాయని సిబ్బంది కోరత వలన ఆలస్యం అవుతుంది కావున మ్యాన్ పవర్ పెంచి వారికి ఎల్ఆర్ఎస్ ట్రెనింగ్ ఇచ్చి ప్రక్రియను వేగవంతం చేయడానికి నా తరపున నుండి ఎలాంటి సహకారానికైన సిద్ధం అని తెలిపారు. అలాగే ఇరిగేషన్, రెవెన్యూ అదికారులు ఎల్ఆర్ఎస్ యాప్ లో చేసే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అందరు అదికారులు సమన్వయంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట సూడా డిటిసిపిఓ వందనం, మున్సిపల్ టిపిఓ లు నస్రీన్ బాను, దేవరాజు, ఎల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అదికారులు తదితరులు పాల్గొన్నారు.

## "మూటలో మహిళా శవం"..

## వీడిన హత్య కేసు మిస్టరీ

**అక్రమ సంబంధమే అంతం చేసింది**

**శంషాబాద్ శుభ తెలంగాణ:** మూటలో మహిళను చంపి ఆమె శవాన్ని బ్లాంకెట్లో చుట్టి ప్లాస్టిక్ కవర్లో డ్రైనేజీ పక్కన పడేసిన మహిళా హత్య కేసు మిస్టరీలో షాద్ నగర్ పోలీసులు పురోగతి సాధించారు. కేవలం మూడు రోజుల్లోనే కేసు లోని మిస్టరీని ఛేదించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో సంచలనం సృష్టించిన “మూటలో మహిళా శవం” హత్య కేసు వివరాలను షాద్ నగర్ ఏసిపి ఎన్.సిహెచ్ రంగస్వామి మంగళవారం మీడియాకు వెల్లడించారు.

**చెడు వ్యసనాలే ప్రమాదకరం**

గత నెల 27వ తేదీ రాత్రి అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళ కన్నా భాగ్యలక్ష్మి అలియాస్ లక్ష్మి (40) హత్యకు గురైంది. ఆమె శవాన్ని ఓ బ్లాంకెట్ లో చుట్టి ప్లాస్టిక్ కవర్లో వేసి ఫరూక్ నగర్ శ్రీనివాస కాలనీలో ఓ డ్రైనేజ్ పక్కన మూటగట్టి పడేశారు. పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.. చెడు వ్యసనాలకు అలవాటు పడి దురాశతో కన్నా భాగ్యలక్ష్మిని గద్వాల జిల్లా చాగాపురం గ్రామానికి చెందిన వడ్డే పరమేష్ (43) ఆమెతో అక్రమ సంబంధం ఏర్పాటు చేసుకొని ఆ తర్వాత అరతులం బంగారం కోసం ఆశపడి ఆమెను గొంతు పిసికి హత్య చేశాడని ఏ ఏసీపీ వివరించారు. కన్నా భాగ్యలక్ష్మి 27వ తేదీ రాత్రి 10 గంటలకు వడ్డే పరమేష్ తో కలిసి ఇంటికి చేరుకుంది. అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళ భాగ్యలక్ష్మి రాత్రి 10 గంటల తర్వాత భోజనం చేసిన అనంతరం 11 గంటల సమయంలో నిందితుడు వడ్డే పరమేష్ భాగ్యలక్ష్మి గొంతు పిసికి అరవకుండా ఆమె నోరు మూసి హత్య చేశాడు. తరువాత ఆమె చెవి కమ్మలు, పూస్తే, 5000 రూపాయల నగదు దోచుకుని ఫ్యాషన్ బైక్ పై వెళ్లిపోయినట్లు పోలీసులు గుర్తించారు. అనేక సీసీ కెమెరాలు పరీక్షించి ఆ తర్వాత కొన్ని ఆధారాలతో నిందితుడు అద్దెకు ఉంటున్న యాదవ కాలనీలో ఓ ఇంట్లో వడ్డే పరమేష్ ను గుర్తించినట్టు తెలిపారు.

# రాజీనామా ఎవరు చేయాలో సీఎం చెప్పాలే

**దేవుళ్లపై ఒట్టు పెట్టుకుని మోసం చేసిండ్లు**

**రాష్ట్రాన్నిఅల్లకల్లోలం చేస్తున్న రేవంత్ సర్కార్**

**మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథనిశుభ తెలంగాణ :** రుణమాఫీ విషయంలో ఎవరు రాజీనామా చేయాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు రైతులందరికి రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే లు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి తో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ఖమ్మంలో జరిగిన కాంగ్రెస్ మీటింగ్‌లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి రైతులందరికి రుణమాఫీ చేస్తున్నం మాజీ మంత్రి హరీష్‌రావు ఇక రాజీనామా చేయి అంటూ మాట్లాడారని, ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకుండానే గొప్పలు చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు రుణమాఫీపై వినతిపత్రం ఇస్తామని తెలిసి జిల్లాలోని అనేక మంది రైతులు తరలివచ్చారని, ఏక్కేటి రాజయ్య అనే రైతు వచ్చిన తన రూ.35వేల రుణం మాఫీ కాలేదని చెప్తున్నాడని, దీనికి ఏమని సమాధానం చెప్తారని ఆయన ప్రశ్నించారు. ఆనాడు దేవుళ్లపై ఒట్లు పెట్టుకుని రైతులందరికి రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అనేక మంది రైతులకు రుణమాఫీ చేయాలేదన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ వర్గానికి అన్యాయం జరుగకుండా పరిపాలన జరిగిందని, అలాంటి పాలనలో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి అధికారంలోకి వచ్చిన చరిత్ర కాంగ్రెస్‌పార్టీదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తోందని, ఏ ఒక్క వర్గం సంతృప్తిగా లేదన్నారు.ఇందిరమ్మ రాజ్యం అంటే కేవలం కాంగ్రెస్ పార్టీ పెద్దలే సంతోషంగా ఉండటమేనా అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు సైతం అసంతృప్తిగా ఉన్నారని, వారికి పథకాలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లు తెరిచి ప్రజలకష్టాలను గుర్తించాలని ఆయన హితవు పలికారు.

## ఉస్మానియా కళాశాలలో

## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి ఉత్సవాలు.


**కర్నూలుశుభ తెలంగాణ :** భారతదేశ చరిత్రను మార్చిన మహనీయుడు మహాత్మా గాంధీ, సత్యాన్ని, అహింసా మార్గాన్ని తిరుగులేని ఆయుధంగా మార్చగలిగిన గొప్ప ధైర్యశాలి అలాంటి మహనీయుడు జీవితాన్ని ప్రతి విద్యార్థి తప్పక తెలుసుకోవాలని ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ అన్నారు. నేడు ఉస్మానియా కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మహాత్ముడి జీవితం లోని ముఖ్యమైన సంఘటనలను విద్యార్థులకు తెలియజేశారు. ప్లేస్మెంట్ అధికారి, తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఉన్న లోపాలను సవరించుకుంటూ గొప్ప వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటూ ఎదగాలని, మహాత్మా గాంధీ జీవితంలో త్యాగానికి ఉన్న గొప్పదనాన్ని తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ‘గాంధీజీ జీవితం – రాజకీయ సేవ’ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు గాంధీ గారి స్వీయ చరిత్ర “సత్యశోధన” అనే గ్రంథాన్ని బహుమతులుగా అందజేశారు. అనంతరం ఉన్నతి ఫౌండేషన్ చేంజ్ మేకర్ హిమ బిందు విద్యార్థులకు నిర్వహించబోయే శిక్షణ కార్యక్రమం గురించి వివరించారు. ఉస్మానియా కళాశాల ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ ఎస్. గౌస్ పీరా వందన సమర్పణ చేశారు.

# తెలంగాణ ప్రతీక బతుకమ్మ విశిష్ఠత తెలుసా..!!

**హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు ప్రతీక బతుకమ్మ ఆడబిడ్డలంతా సంబురంగా జరుపుకొనే ఘనమైన వేడుక ఇది. ప్రకృతిని ఆరాధిస్తూ సాగే పూల పండుగ బతుకమ్మ. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచంలో మరెక్కడా కనిపించని, తెలంగాణకు మాత్రమే సొంతమైన వినూత్నమైన, అరుదైన పూలవేడుక బతుకమ్మ. పూలతో దేవుడిని కొలవడం కాదు.. పూలనే దేవుడిలా కొలిచే వేడుక ఇది. బతుకమ్మ అంటే బతుకుదెరువును మెరుగుపరిచే అమ్మ అని అర్థం. తొమ్మిది రోజులు తెలంగాణ అంతటా ఒక జాతరలా సాగి చివరిరోజు సద్దుల బతుకమ్మగా మన వాకిట్లో బతుకుదెరువును ఆవిష్కరిస్తుంది. ఆటపాటలతో మనల్ని సేదతీరుస్తుంది. జీవన సంబురాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో మాత్రమే జరుపుకొనే పండుగ బతుకమ్మ. స్వరాష్టంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొంది నేడు ప్రపంచంలో తెలంగాణవారున్న చోటల్లా పూలజాతరై వర్ధిల్లుతోంది. ఆడబిడ్డలంతా ఒక్కచోట చేరి వాడవాడలా నిర్వహించే ఉత్సవమే బతుకమ్మ.

బతుకమ్మ వేడుకను ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజులు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. భాద్రపద అమావాస్య లేదా పెత్రమాస రోజు నుంచి అశ్వయుజ అష్టమి వరకు తొమ్మిది రోజులు ఈ సంబురం కొనసాగుతుంది. ఆడబిడ్డలంతా చివరి రోజు అశ్వయుజ అష్టమి నాడు ఉపవాసం పాటిస్తూ, స్నానాధికాలు ముగించుకుని, ముందుగా చిన్న బతుకమ్మను పేరుస్తారు.

## పరిసరాల పరిశుభ్రత అనేది నేరాలను తగ్గిస్తుంది



**జయశంకర్ భూపాలపల్లిశుభ తెలంగాణ :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మానసిక ఆరోగ్యం బాగుంటుందని, మానసిక ఆరోగ్యం బాగుంటే నేరం చేయాలనే ఆలోచన రాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. నారాయణ బాబు అన్నారు. స్వచ్ఛత హై సేవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణం వద్ద ప్రారంభం అయిన న్యాయ అవగాహన ర్యాలీ అంబెద్కర్ సెంటర్ నుండి తిరిగి జిల్లా ప్రధాన న్యాయస్థానం వరకు సాగింది. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మరియు విద్యార్థులను ఉద్దేశించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రసంగించారు. జడ్జి మాట్లాడుతూ... హై కోర్ట్ వారి ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణాల్లో స్వచ్ఛ్ హై సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పరిశుభ్రత అనే సేవను అందరూ చేయాలనీ అప్పుడు దేశం మొత్తం శుభ్రంగా తయారవుతుందని అన్నారు. అను నిత్యం మనందరి కోసం శ్రమిస్తున్న పారిశుద్ధ కార్మికులను గౌరవించాలని జడ్జి గారు సూచించారు, పారిశుద్ధ కార్మికులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి గారు సన్మానించారు.

# ఈ చెట్టు ఉంటే చాలు ఎలాంటి వ్యాధులు రావు



ప్రకృతి చాలా ఔషధాలను నార్మల్ గానే అందిస్తుంది. ఎన్నో మొక్కల్లో ఔషధ గుణాలు పుష్కలంగా ఉంటాయి. సరిగా వాడటం తెలియాలి కానీ ఇంటి వెనకాల పెరట్లోనే ఎన్నో రోగాలకు చెక్ పెట్టే మొక్కలు ఉంటాయి. ఆయుర్వేదం చేసే గొప్ప పని ఇదే. ఇంటి ముందు ఉన్న తులసికి పూజ చేస్తారు. ఇదే తులసిలో చెప్పలేనన్ని ఔషధ గుణాలు ఉన్నాయి. మందారం, గులాబీ, తులసి, ఉసిరి ఇలా చాలా చెట్లతో ఎన్నో సమస్యలకు నార్మల్ గా చెక్ పెట్టవచ్చు. అయితే ఇప్పుడు ఉసిరి గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం. ఉసిరిలో చాలా రకాల ఔషధ గుణాలున్నాయి. రోజుకో యాపిల్ తినలేని వారు ఒక ఉసిరి తింటే చాలు అంటారు పెద్దలు. అయితే కాయలు మాత్రమే అనుకోవద్దు. ఎందుకంటే ఉసిరి ఆకులతో కూడా శరీరానికి ఎన్నో బెనిఫిట్స్ అందుతాయి. ఎన్నో రకాల వ్యాధుల నయం చేయడంలో ఉసిరి ఆకులు ది బెస్ట్ మెడిసిన్ అనిపించుకున్నాయి. ప్రమాదకర హెపటైటిస్ వంటి వ్యాధులకు కూడా ఉసిరాకుతో చెక్ పెట్టవచ్చు అంటున్నారు ఆయుర్వేద నిపుణులు. ఉసిరి ఆకులు చాలా వగరుగా ఉంటాయి. కాస్త తీపి రుచి కూడా మిళితం అవుతుంది. ఆయుర్వేదం ప్రకారం మన శరీరంలో 3 రకాల దోషాలు ఉంటాయట. వాత, పిత్త, కఫ వంటి దోషాలు ఉంటాయి. ఈ దోషాలకు విరుగుడు ఉసిరి ఆకు అని సలహా ఇస్తున్నారు నిపుణులు. ఉసిరి ఆకులు పప్పు వంటి వాటిల్లో వేసుకొని వండుకోవచ్చుట. ఇక పొడిలాగా మార్చి కూడా ఉపయోగించవచ్చు. బ్లడ్ డిజార్డర్స్, ఇన్ఫ్లమేషన్, మలేరియా, యూరినరీ ట్రాక్ట్ ఇనెఫెక్షన్ వంటి 120 వ్యాధుల చికిత్సలో ఈ ఉసిరిని వాడుతున్నారు. కేవలం ఉసిరి ఆకుల వల్ల కూడా ఎన్నో వ్యాధులకు చెక్ పెట్టవచ్చు అన్నమాట. ఉసిరి ఆకుల పొడి తీసుకుంటే.. కడుపులో అల్సర్ సమస్య నుంచి దూరంగా ఉండవచ్చు. ఉసిరి ఆకుల్లో ఉండే యాంటీ-ఆక్సిడెంట్, యాంటీ-వైరల్ లక్షణాల వల్ల లివర్ డ్యామేజ్ నుంచి కూడా దూరంగా ఉండవచ్చు. అలానే లివర్ ఫంక్షనింగ్ కు మెరుగు అవడానికి తోడ్పడుతుంది ఉసిరి. ఉసిరిలోని పోషకాలు.. కాలేయ కణాలను ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించడంలో సహాయం చేస్తాయి. ఉసిరి ఆకుల పొడిని తీసుకోవడం వల్ల దగ్గు, కఫం, జ్వరాల వంటి నుంచి తప్పించుకోవచ్చు. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.

# ఆ సమయంలో అధిక చెమటకు కారణం ఇదేనా?

హైపర్ హైడ్రోసిస్ గురించి విన్నారా..? విపరీతమైన చెమటలు పట్టే శారీరక స్వభావం కలిగి ఉన్నవారిలో ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. అదేం ప్రాణాంతకం కాదు కానీ ఇబ్బందిగా అనిపిస్తుంది. బయటి పరిస్థితుల్లో ఉన్నప్పుడు చెమటలు పట్టినా గాలివల్ల అవి ఆరిపోతుంటాయి. ఇంట్లో ఖాళీగా ఉన్నప్పుడు అలా జరిగితే స్నానం చేసేస్తారు. కానీ ఆఫీసుల్లోనో, మీటింగుల్లోనో పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో అలా జరిగితే ఏం చేస్తారు?.. ఇక భరించాల్సిందే. కానీ చాలా కాలం అదే కొనసాగితే దుర్వాసన వెదజల్లే పరిస్థితి వస్తుంది. అధిక చెమటలకు దుర్గంధం తోడైతే 'బ్రొమిడోసిస్' అనే బ్యాక్టీరియా డెవలప్ అవుతుందని, ఇది 'హైపర్ హైడ్రోసిస్' వ్యాధికి దారితీస్తుందని చర్మవ్యాధి నిపుణులు చెప్తున్నారు. చెమటలోని లవణీయతకు బ్యాక్టీరియా తోడైతే దుర్గంధం పెరుగుతుంది. ఇదే హైపర్ హైడ్రోసిస్ వ్యాధికి దారితీస్తుంది. అయితే కొందరు చిన్న సమస్యే అనుకని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఎక్కువసార్లు స్నానం చేయడంవల్ల, అనుకూలంగా ఉండే దుస్తులు ధరించడంవల్ల ప్రాబ్లం క్లియర్ అవుతుందని మరికొందరు భావిస్తుంటారు. కానీ ఇది సరైన పరిష్కారం కాదని, వ్యాధికి గల మూలకారణాలను నివారించడమే మంచిదని చర్మవ్యాధి నిపుణులు చెప్తున్నారు.




విపరీతమైన చెమటలతో వచ్చే దుర్గంధాన్ని పోగొట్టుకోవడానికి మెడికేటెడ్ సోప్స్, లోషన్స్, పౌండర్లు, సెంట్లు వాడుతుంటారు కొందరు. ఇవి కూడా పర్మినెంట్ సొల్యూషన్ కాదు. పైగా హైపర్ హైడ్రోసిస్‌ను నిర్లక్ష్యం చేస్తే క్రమంగా ఎర్రటి లేదా నీలం రంగు చెమటతో కూడిన 'క్రోమిడ్రోసిస్' అనే వ్యాధికి దారితీయవచ్చు. కొన్నిసార్లు అసలుకే చెమలు పట్టకపోవడం అనే 'ఎన్ హైడ్రోసిస్'కు కారణం కావచ్చు. ఇది చెమటలు పట్టడంవల్ల కలిగే ప్రయోజనాలను అడ్డుకుంటుంది. అందుకే దుర్వాసనతో కూడిన అధిక చెమటలు పట్టే పరిస్థితిని ఎదుర్కొనే వారు వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది. ఇక చెమటలు పట్టినప్పుడు బయటకు రాకపోయినా, అధిక చెమటలు పట్టినా, అసలుకే పట్టకపోయినా కూడా ప్రమాదమే. ఒక సాధారణ స్థాయిలో చెమటలు పట్టడమే మానవ ఆరోగ్యానికి మంచిది. చెమటలు పట్టి శరీరం నుంచి బయటకు వెళ్లడానికి అవసరం అయిన స్వేద గ్రంధులు లేకపోతే 'మిలియేరియా' అనే వ్యాధి వస్తుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. ఈ పరిస్థితిలో శరీరంపై చెమట గుల్లలుగా మారుతుంది. ఉష్ణోగ్రతలు పెరిగితే లేదా వేసవిలో చెమట పొక్కులు రావడం, మంటగా అనిపించడం జరగవచ్చు. చేతుల పైభాగంలో, ఛాతిమీద పొట్టమీద పొక్కులకు దారితీయవచ్చు. కాస్త తేమ లేదా తడి ఉండే అవకాశమున్న శరీర భాగాల్లో ముఖ్యంగా గజ్జలు, పాదాల వ్రేళ్ల మధ్య, చంకల్లో అధిక చెమటవల్ల ఫంగస్ డెవలప్ అవుతుంది. ఈ క్రమంలో పరిశుభ్రత పాటించకపోతే 'ఆస్పర్జిల్లస్' అనే ఫంగస్ వ్యాపించి చెవులు, చర్మం, ఊపిరితిత్తుల్లో సమస్యలకు దారితీయవచ్చు.

# రాత్రి సమయాలలో పెరుగు తింటున్నారా..?



రాత్రి సమయాలలో భోజనం తినే సమయంలో చాలామందికి కచ్చితంగా పెరుగన్నం లేకపోతే పెరుగు తినడానికే మక్కువ చూపుతూ ఉంటారు. అయితే ఇలా రాత్రిపూట పెరుగు తినడం వల్ల చాలా ప్రమాదమని కొంతమంది నిపుణులు తెలియజేస్తున్నారు. ఎక్కువగా పెరుగు తింటే కచ్చితంగా జలుబు చేస్తుందని లేకపోతే అధిక బరువు పెరుగుతారని చాలామంది అనుకుంటూ ఉంటారు. మరి కొంతమంది పెరుగు ఎక్కువగా తినడం వల్ల అవసరమైన పోషకాలు లభిస్తాయని దీంతో ఎక్కువ కాలం బతికేస్తారనే విధంగా కూడా చెబుతూ ఉంటారు. ముఖ్యంగా పెరుగులో క్యాల్షియం ,మెగ్నీషియం, విటమిన్స్ వంటివి ఉండడమే కాకుండా బ్యాక్టీరియాని కూడా చాలా సమృద్ధి చేస్తాయి. పెరుగు జీర్ణ వ్యవస్థని మెరుగుపరచడానికి మలబద్ధక సమస్యను సైతం తగ్గించడానికి కూడా ఉపయోగపడుతుంది. రోజు పెరుగు తీసుకోవడం వల్ల ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ మూత్రపిండాల వ్యాధులను సైతం అదుపులో ఉంచడమే కాకుండా రక్తంలో ఉండే గ్లూకోజ్లను తగ్గించి మరి సరఫరా చేస్తుండట. ఎవరైతే ఫిట్నెస్ బాడీని మెయింటైన్ చేయాలనుకున్నారో వ్యాయామం చేసిన తర్వాత ప్రతిరోజు ఒక గ్లాసు పెరుగుని తీసుకోవడం వల్ల ఇందులో ఉండే ప్రోటీన్ల ఫలితం వల్ల శరీరాకృతిని మార్చుకోవచ్చు. ప్రతిరోజు పెరుగు తినడం వల్ల శరీరానికి మేలు జరుగుతున్నప్పటికీ రాత్రి సమయంలో మాత్రం పెరుగుని తినడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయట. ముఖ్యంగా పెరుగులో ఉండే టైరామైన్ కంటెంట్ నిద్ర పోనివ్వకుండా చేస్తుందట అలాగే నిద్రలేని సమస్యలను కూడా రావడానికి కారణమవుతుందట పెరుగు. కొంతమంది పెరుగు తినడం వల్ల దగ్గు జలుబు సమస్యలు అధికంగా వస్తాయి అలాగే ఇందులో ఉండే అధిక కొలెస్ట్రాల్ వల్ల కీళ్ల నొప్పులు కూడా వస్తాయట.

# నీళ్లు తక్కువగా తాగుతున్నారా?



ప్రతిరోజు మన శరీరానికి అవసరమైనంత నీరు త్రాగాలి. తక్కువ నీరు తాగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంలో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందుకే ప్రతిరోజూ ఎక్కువ నీరు తాగాలని గుర్తుంచుకోవాలి. మనం తక్కువ నీరు తాగితే శరీరంలో కొన్ని అనారోగ్య సంకేతాలు కనిపిస్తాయి. వాటిలో ముఖ్యమైనది కిడ్నీలో రాళ్ల ప్రమాదం. ఇవి చిన్న చిన్న ఇసుక రేణువుల సైజు నుంచి చిన్న నిమ్మకాయ సైజు వరకు పెరిగే అవకాశం ఉంది. నీటి కొరత వల్ల మూత్రపిండాల్లో రాళ్లుగా మారతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, శరీరంలో నీరు లేనప్పుడు, మూత్ర పరిమాణం తగ్గుతుంది. మూత్రం శరీరంలో ఎక్కువగా కేంద్రీకృతమై ఉంటుంది. ఈ సాంద్రీకృత మూత్రంలో కాల్షియం, ఆక్సలేట్, యూరిక్ యాసిడ్ వంటి ఖనిజాలు అధిక మొత్తంలో ఉంటాయి. ఇవి కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి కారణమవుతాయి. సకాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే, ఈ చిన్న స్ఫటికాలు పెద్ద రాళ్లుగా మారవచ్చు. దీని వల్ల విపరీత మైన నొప్పి, ఇతర సమస్యలను కలిగిస్తుంది. డీహైడ్రేషన్ వల్ల మూత్రం ఎక్కువసేపు అలాగే ఉండి.. దాని వల్ల స్ఫటికీకరణ ప్రక్రియ మొదలవుతుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది. సకాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే, ఈ చిన్న స్ఫటికాలు పెద్ద రాళ్లుగా మారే ప్రమాదం ఉంది. మీరు తగినంత నీరు త్రాగితే, అది మూత్రంలో ఖనిజాలు, లవణాలను పలుచన చేస్తుంది. ఇది కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశాలను తగ్గిస్తుంది. అందువల్ల, ప్రతి రోజు తగిన మోతాదులో నీరు త్రాగటం చాలా ముఖ్యం. రోజంతా శరీరానికి కనీసం 8-10 గ్లాసుల నీరు అవసరమని నిపుణులు చెబుతున్నారు. తగినంత మొత్తంలో నీరు త్రాగడం వల్ల మూత్రం పలచబరుస్తుంది, మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశాలను తగ్గిస్తుంది. కావున ఇన్ని సమస్యలకు మనం సరిగా నీళ్లు తాగకపోవడమే కారణం కాబట్టి, పుష్కలంగా నీటిని తాగితే అనేక అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టి ఆరోగ్యంగా జీవించవచ్చు.

# ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలా..?



ఎప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ అనుకోకుండా శారీరక, మానసిక ఇబ్బందులు సంభవిస్తుంటాయి. అయితే వీటికి చాలా వరకు ఎవరికి వారే కారణం అవుతుంటారని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా జీవన శైలిలో ప్రతికూల మార్పులు, పోషకాహార లోపాలు, క్షణం తీరికలేని పని పరిస్థితులు, నిరంతర ఆందోళనలు, సమయానికి తినకపోవడం, ఫిజికల్ యాక్టివిటీస్‌కు దూరంగా ఉండటం వంటివి ఇందులో భాగంగా ఉంటున్నాయి. ఇవి సహజంగానే ఆరోగ్యాన్ని, ఆనందాన్ని దూరం చేస్తుంటాయి. కాగా ప్రస్తుతం ఈ సమస్యలను ఎదుర్కొంటున్నవారిలో ఎక్కువ మంది గృహిణులే ఉంటున్నారని నిపుణులు చెప్తున్నారు. జీవితంలో సంతోషంగా ఉండాలంటే కొన్ని సమస్యలను దూరం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు నాలుగు విషయాలపై దృష్టి పెట్టాలని చెప్తున్నారు. అలాంటి వాటిలో ఫిజికల్ యాక్టివిటీస్, క్వాలిటీ స్లీప్, మెడికల్ టెస్టులు, సరైన పోషకాహారం వంటివి ఉన్నాయి. వీటిని రెగ్యులర్‌గా అమలు చేస్తే అనేక వ్యాధులను నివారించవచ్చునని, శరీరంలో వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం కాకుండా అడ్డుకోవచ్చునని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అలాగే మానసిక వికాసానికి, ఫిజికల్ ఫిట్‌నెస్‌కు కూడా ఇవి చాలా ముఖ్యం.

ఫిజికల్ యాక్టివిటీస్ : ఇంటి పనుల్లో, కుటుంబ బాధ్యతల్లో నిమగ్నమవుతూ ఇప్పటికీ మహిళలు తమను తాము నిర్లక్ష్యం చేసుకుంటున్నవారు చాలా మందే ఉంటున్నారు. సమయానికి తినకపోవడంతోపాటు శారీరక వ్యాయామాలకు దూరంగా ఉండటం వారిలో అనారోగ్యాలకు కారణం అవుతోంది. కాబట్టి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ లెవల్స్ అదుపులో ఉంటాయని, బీపీ, మధుమేహం, గుండె జబ్బుల రిస్క్ తగ్గుతుందని చెప్తున్నారు. వారానికి కనీసం 4 నుంచి 5 రోజులు ప్రతిరోజూ 30 నుంచి 60 నిమిషాలు వ్యాయామాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకు తగిన ఆహార నియమాలు పాటించాలి.

క్వాలిటీ స్లీప్ : ఆధునిక జీవనశైలిలో మహిళలను వేధిస్తున్న మరో సమస్య నిద్రలేమి లేదా నాణ్యమైన నిద్రలేకపోవడం. రకరకాల ఆలోచనలు, ఆందోళనలు, ఆర్థిక ఇబ్బందులు ఇందుకు దారితీస్తున్నాయి. కుటుంబంలో ఇతరులకు అనారోగ్యాలు వంటి సందర్భాలు కూడా గృహిణులను ఎక్కువగా కృంగదీస్తున్నాయి. కుటుంబంలోని ఎవరికి అనారోగ్యం చేసినా మహిళలు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారని నివేదికలు పేర్కొంటున్నాయి. దీని కారణంగా వారు నాణ్యమైన నిద్రకు దూరం అవుతున్నారు. చివరకు అనారోగ్యాల బారినపడుతున్నారు. సమస్యలు సహజమే. కానీ ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందనే విషయం కూడా గుర్తుంచుకుంటే ఆందోళనలు దూరం అవుతాయని, తద్వారా నాణ్యమైన నిద్ర సాధ్యం అవుతుందని నిపుణులు చెప్తున్నారు.

మెడికల్ టెస్టులు : చాలా మంది గృహిణులు తమకు వచ్చే శారీరక సమస్యలను చిన్నవిగా భావించి పట్టించుకోరు. చివరికి అవి పెద్ద అనారోగ్య సమస్యలుగా మారుతుంటాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. క్యాన్సర్లు, లివర్ సమస్యలు, మధుమేహం వంటివి పెరిగిపోవడానికి వాటిని ప్రాథమిక దశలో గుర్తించకపోవడమే కారణం అవుతోంది. కాబట్టి శరీరంలో ఏవైనా అనారోగ్య సూచనలు వారానికి మించి కనిపిస్తే వాటి నిర్ధారణకోసం మెడికల్ టెస్టులు చేయించుకోవాలని, తద్వారా ఏదైనా సమస్య ఉంటే అది పెరగకముందే నివారించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. పోషకాహారంపై ఫోకస్ : గృహిణులు చేసే పొరపాట్లలో సరైన పోషకాహారం తీసుకోవడం కూడా ఒకటి. ఇంటిల్లిపాది రుచికరమైన వంటకాలు చేసి పెట్టడం, కుటుంబాన్ని చూసుకోవడం, పనులు చక్కబెట్టడం ఇవన్నీ సక్రమంగా చేస్తున్న మహిళలు తాము మాత్రం సమయానికి తినడం లేదని నివేదికలు పేర్కొంటున్నాయి. కొందరు సమయానికి తింటున్నా సరైన పోషకాలు లేని ఆహారం తీసుకోవడం చివరికి వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. కాబట్టి ఈ విషయాలపై ఫోకస్ పెట్టాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, అప్పుడే ఆరోగ్యాంగా, ఆనందంగా జీవించడం సాధ్యం అవుతుందని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110